జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967


కృష్ణ | సోమవారం 17 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :214 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- శాసన సభలో కూటమి.. మండలిలో వైసీపీ.. బయట జగన్
- అసెంబ్లీకి దూరంగా ఉండాలని వైసీపీ నిర్ణయం
- 'సభకు వస్తే డీఎస్సీ సహా ప్రతి ఆరోపణకూ సమాధానం ఇప్పిస్తా' అంటున్న స్పీకర్ అయ్యన్న
- ప్రతిపక్ష హోదాపై ఎవరి వాదన వారిదే.. మరోసారి రాజకీయ రగడ
- ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- మండలిలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా వైసీపీ




**అమరావతి**

రాష్ట్ర రాజకీయాలకు మరోసారి శాసనసభ వేదిక సిద్ధమైంది. సోమవారం నుంచి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సమావేశాల ఎజెండా, పనిదినాలు, చర్చకు వచ్చే అంశాలు ఒకవైపు ఆసక్తి రేపుతుండగా.. మరోవైపు ప్రధాన ప్రతిపక్ష పార్టీ వైసీపీ అనుసరించబోతున్న వ్యూహం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాబోమని ఇప్పటికే ప్రకటించారు. అయితే శాసనమండలిలో మాత్రం వైసీపీ ప్రతినిధులు హాజరై ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. దీంతో ఈసారి 'సభలో కూటమి.. మండలిలో వైసీపీ.. బయట జగన్' అన్నట్లుగా రాజకీయ చిత్రం కనిపించనుంది.సాధారణంగా అసెంబ్లీ సమావేశాలంటే అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రశ్నలు--సమాధానాలు, ఆరోపణలు--ప్రత్యారోపణలు, వాడీవేడి చర్చలు కనిపిస్తాయి. కానీ ఈసారి అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు లేకుండానే సమావేశాలు - మిగతా3లో



## విద్యార్థుల గొంతును ఇకపై ఎవరూ అణచలేరు

- 'మోదీ హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన యువత'
- విద్యార్థినుల ధైర్యాన్ని ప్రశంసించిన రాహుల్
- పేపర్ లీకులపై ఆందోళన చేసిన విద్యార్థులకు పోలీసుల వేధింపులంటూ రాహుల్ ఆరోపణలు
- శాంతి, ప్రేమ, హాస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని యువత తమ గళాన్ని వినిపించింది.



## వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించింది

- వారికి క్షమాపణలు చెప్పాలి' అమిత్ షా డిమాండ్
- ప్రజలు, గేయరచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే వందేమాతరంను కాంగ్రెస్ విస్మరించిందని విమర్శ



## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు తొలగుతున్న అడ్డంకి

- చివరి దశకు చేరిన టీబీఎం తొలగింపు
- చురుగ్గా సాగుతున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు
- తుది దశకు చేరుకున్న టన్నెల్ బోరింగ్ యంత్రం తొలగింపు పనులు
- ఈ నెల 22న ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారుల ఏర్పాట్లు

**మార్కాపురం**

మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు గ్రామంలో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే రెండో సొరంగం తవ్వేందుకు వినియోగించిన టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) తొల గింపు పనులు చివరి దశకు చేరుకున్నాయి. 18.89 కిలోమీటర్ల మేర రెండో సొరంగం తవ్వేందుకు ఈ యంత్రంతో 2009లో పనులు ప్రారంభించారు. 11.84 కిలోమీటర్ల మేర తవ్వకం పనులు 2019 వరకు కొనసాగాయి. ఆ తర్వాత - మిగతా3లో

## 'నా మిత్రులు నన్ను కలవడానికి వచ్చాయి'

ఎర్రకోటకు వెళ్లే ముందు ఆవులు, నెమళ్లతో మోదీ ముచ్చట్లు

ఎర్రకోటకు బయలుదేరే ముందు జంతు మిత్రులతో ప్రధాని మోదీ ఆత్మీయ క్షణాలు

ఆవులు, నెమళ్లకు ఆహారం అందిస్తూ, వాటితో ముచ్చటించిన ప్రధాని



## విశాఖకు విమానాల రాకపోకలు బంద్

ఇవాళ అర్ధరాత్రి నుంచి విశాఖ విమానాశ్రయం సేవలు సమాప్తం

భోగాపురం విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభం

ఈ నేపథ్యంలో విశాఖ విమానాశ్రయం నుంచి విమానాలు నిలిపివేత



**అమరావతి**

ప్రతి ప్రాంతానికి ఒక చరిత్ర ఉంటుంది. అంతేకాకుండా, దానితో ముడిపడి ఉన్న ప్రత్యేక అనుభవాలు, అనుభూతులు ఉంటాయి. ఒక ప్రదేశం ఇకపై అక్కడ ఉండదని హఠాత్తుగా తెలిస్తే. తలచుకుంటూనే మనసంతా ఏదోలా ఉంది కదూ. ఇదంతా విశాఖ విమానాశ్రయం గురించే. ఎందుకంటే దీనికి 80 సంవత్సరాల చరిత్ర ఉంది. నేటి అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్?పోర్ట్? సేవలు సమాప్తం కానున్నాయి. దీంతో ఈ విషయాన్ని - మిగతా3లో



## ప్రధాని చేసిన మేధో నక్సల్స్ వ్యాఖ్యలు విపక్షాలను ఉద్దేశించి కాదు

- నక్సల్స్‌కు మద్దతిచ్చేవారిని, రాజ్యాంగాన్ని తిరస్కరించేవారినే అన్నట్లు వెల్లడి
- ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత విమర్శలు

# పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- కేంద్రం పరిశీలనలో రెండో విడత 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ప్రాజెక్టులు
- రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులు కేంద్రానికి ప్రతిపాదన
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూడీఎఫ్) రెండో విడత కింద ఏకంగా రూ.5,940 కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నాలుగు ప్రధాన నగరాలతో పాటు 59 పురపాలక సంఘాల్లో తాగునీరు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేలా ప్రాజెక్టులు రూపొందించారు. పట్టణాల అభివృద్ధికి కేంద్రం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో విడతలో భాగంగా రూ.5,940 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖకు పంపింది. ఇప్పటికే దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చ జరిగింది. డీపీఆర్‌లు సిద్ధం చేసిన తర్వాత మరోసారి కేంద్రంతో సమావేశం నిర్వహించనున్నారు. వాటా నిధుల కోసం హడ్కో రుణం విజయవాడ, నెల్లూరు, గుంటూరు, రాజమహేంద్రవరంతోపాటు మరో 59 పురపాలక సంఘాల్లో రెండో విడతలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సమకూర్చాల్సిన వాటా నిధుల కోసం ప్రభుత్వం హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. నగరపాలక సంస్థల్లో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంది. హడ్కో రుణం ప్రతిపాదనలు ఆర్థికశాఖ పరిశీలనలో ఉన్నాయి. - మిగతా3లో

## పార్లమెంట్‌ను అణచివేసి రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు

- ఆ ప్రశ్నలను తిరస్కరించడంపై సీజేపీ ఫైర్
- ప్రజాస్వామ్య పాలనలో 'ప్రశ్నోత్తరాల సమయం' అత్యంత కీలకమైనది
- అడ్డుకోవడం ద్వారా కార్యనిర్వాహక వర్గాన్ని ప్రజల నిఘా నుంచి ప్రభుత్వం రక్షిస్తోంది
- నిరసనల్లో పోలీసుల చర్యల గురించి హోం మంత్రి అమిత్ షా పార్లమెంటును ఉద్దేశించి నేరుగా ఎందుకు మాట్లాడలేదని సౌరవ్ దాస్ ప్రశ్న



# విద్యార్థుల గొంతును ఇకపై ఎవరూ అణచలేరు



నీట్ పేపర్ లీక్ సహా వివిధ పరీక్షల అక్రమాలపై ఆందోళనలకు దిగిన విద్యార్థులపై కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలు కురిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, అధికారాన్ని ప్రశ్నిస్తూ నిలబడిన భారత యువత ధైర్యం, పట్టుదలను కొనియాడారు. ముఖ్యంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థినులు ఎదుర్కొన్న వేధింపులు, దూషణలు, హింసను ప్రస్తావిస్తూ వారికి తన మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో ఇటీవల నిర్వహించిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. 'జవాబుదారీతనం కోసం పోరాడుతూ, మోద హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన భారత యువత ధైర్యం, స్థైర్యం ప్రశంసనీయం. శాంతి, ప్రేమ, హాస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని యువత తమ గళాన్ని వినిపించింది. అధికారాన్ని ప్రశ్నించడం, తమ హక్కుల కోసం నిలబడటం ప్రజాస్వామ్యంలో కీలకం. బీజేపీ కార్యకర్తల నుంచి దురుసు ప్రవర్తన, మాటల దాడులు, హింసను ఎదుర్కొన్నప్పటికీ విద్యార్థినులు వెనక్కి తగ్గలేదు. కొంతమందిని ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పే పరిస్థితికి కూడా నెట్టారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న ప్రతి ఒక్క యువతిపై తనకు గర్వంగా ఉంది. ఇక వారి గొంతులను ఎవరూ అణచలేరు. విద్యార్థులు తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

**పుణెలో 'ఛత్రోన్ కీ గూంజ్'**

ఇక విద్యార్థులతో తన సమావేశాలను కొనసాగించనున్నట్లు రాహుల్ తెలిపారు. ఆగస్టు 22న పుణెలో 'ఛత్రోన్ కీ గూంజ్' పేరుతో మరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసారి కార్యక్రమం ప్రత్యేకంగా విద్యార్థినుల కోసమే నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఇప్పుడు అమ్మాయిలు మాట్లాడతారు. దేశం వింటుంది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను నేరుగా వినడం, వారి అనుభవాలను దేశ ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**ఆగస్టు 5న విద్యార్థులతో భేటీ**

రాహుల్ గాంధీ ఈ నెల 5న విద్యార్థులతో సమావేశమైన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదుగురు విద్యార్థులు ఆయనతో కలిసి మీడియా ముందుకు వచ్చారు. వారిలో మోడల్ రియా అహిర్ కూడా ఉన్నారు. ముంబైలో విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసు వ్యాన్‌ను అడ్డుకుంటూ ఆమె నిలబడిన ఫొటో అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. తనపై ఆన్‌లైన్‌లో వేధింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రియా అహిర్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

ఇక దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల్ని కూడా రాహుల్ గాంధీ ఇటీవల జరిగిన ఛత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో ప్రస్తావించారు. ఈ నిరసనలు చీకటిలో వెలుగు దివ్వెలా నిలిచాయని, తమ భయాల్ని పక్కనబెట్టి పోరాడిన యువతకు శుభాకాంక్షాలు తెలిపారు. అయితే సమస్యల్ని పరిష్కరించేందుకు ద్వేషం, హింసను ఆశ్రయించబోమని స్పష్టం చేసిన రాహుల్ గాంధీ 'ప్రేమ, ఆప్యాయతతో వ్యవస్థను మారుస్తాం' అని చెబుతూ, యువత కూడా అదే మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు హాజరయ్యారు. తీవ్రంగా కురిసిన వర్షానికి మైదానంలో నీళ్లు నిలిచిపోవడం, బురద పేరుకుపోయి నప్పటికీ పెద్ద ఎత్తున యువత కార్యక్రమానికి తరలివచ్చారు. రాహుల్ గాంధీ రాకకు ముందు ముంబయికి చెందిన ర్యాపర్లు డ్యాన్స్ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమానికి ముందు రోజు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అంతకుముందు హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ఇబ్బందుల్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలిపారు

# పార్లమెంట్‌ను అణచివేసి రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు



లోక్‌సభ సమావేశాల్లో నీట్-యూజి 2026 పరీక్షా అక్రమాలు, విద్యార్థుల ఆందోళనలపై లేవనెత్తిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో తిరస్కరించడంపై కాక్రోచ్ జనతా పార్టీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలనలో 'ప్రశ్నోత్తరాల సమయం' అత్యంత కీలకమైనదని, దీనిని అడ్డుకోవడం ద్వారా కార్యనిర్వాహక వర్గాన్ని ప్రజల నిఘా నుంచి ప్రభుత్వం రక్షిస్తోందని ఆయన విమర్శించారు. అనేక వారాల పాటు సాగిన నిరసనల్లో పోలీసుల చర్యల గురించి హోం మంత్రి అమిత్ షా పార్లమెంటును ఉద్దేశించి నేరుగా ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. "ఇటీవల ముగిసిన లోక్‌సభ సమావేశాల్లో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలోని యువజన నిరసనలకు సంబంధించిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతించకపోవడం ఆందోళనకరం. లోక్‌సభ ఎంపీ మాథేశ్వరన్ వి.ఎస్. మూడు సెట్ల ప్రశ్నల (నోటీసు రిఫరెన్స్ నెం. 101799, 101801) ద్వారా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నుంచి సమాధానాలు కోరారు. ఈ ప్రశ్నలను పార్లమెంటులో అడగలేకపోతే, ప్రభుత్వాన్ని ఎక్కడ జవాబుదారీగా చేయాలి? నిరసనల ద్వారానా? ఆ కీలక వారాల్లో హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు ముందుకు వచ్చి, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పలేదు

నీట్-యూజీ 2026 అభ్యర్థులకు రీఫండ్‌లు, పేపర్ లీక్ ఆందోళనలు, ఢిల్లీలో నిరసనకారులకు నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను నిరాకరించడం, శాంతియుత ప్రదర్శనల పట్ల ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలను ఎంపీ అడిగారు. అయితే, రూల్ 41(2) కింద అనేక నిబంధనలను ఉటంకిస్తూ ప్రశ్నలను పార్లమెంటరీ అధికారులు తిరస్కరించారు. "పార్లమెంటును ఏయే అంశాలపై సమాధానాలు కోరారో మీరే చూడండి. 1. నీట్-యూజీ 2026 దరఖాస్తు ఫీజుల రీఫండ్ 2. ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా అపనమ్మకం 3. ఢిల్లీలో సీజేపీ నిరసనకారులకు తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను నిరాకరించడం 4. నిరసన చేస్తున్న విద్యార్థులు, యువతపై ప్రభుత్వ వైఖరి 5. విద్యార్థుల సంక్షేమం, పేపర్ లీక్‌లు, విద్యా సంస్కరణలు 6. శాంతియుత నిరసన తెలిపే తమ ప్రాథమిక హక్కును వినియోగించుకుంటున్న పౌరుల పట్ల వైఖరి. అయితే, ఈ ప్రశ్నలను రూల్ 41(2) వివిధ క్లాజులను ఉటంకిస్తూ తిరస్కరించారు" అని సీజేపీ నేత సౌరవ్ దాస్ అన్నారు. ఇలా ప్రజాస్వామ్య సంస్థలు సభలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరాకరించినప్పుడు, పౌరులకు తమ నిరసనలను వీధుల్లోకి తీసుకువెళ్లడం తప్ప మరో మార్గం ఉండదని సౌరవ్? దాస్ అభిప్రాయపడ్డారు. ఎంపీలను ప్రశ్నలు అడగకుండా అడ్డుకోవడం, ప్రభుత్వం- ప్రజల మధ్య వారధిగా పార్లమెంట్ పోషిస్తున్న పాత్రను బలహీనపరుస్తుం దన్నారు. ఇలాంటి చర్యల వల్ల కార్యనిర్వాహక నిర్ణయాలకు పార్లమెంట్? ఒక 'రబ్బర్ స్టాంప్'గా మారుస్తుందని అన్నారు. "కార్యనిర్వాహక వర్గాన్ని ప్రశ్నించే ఎంపీ హక్కు ఏదో విధానపరమైన సమస్య కాదు. అది వాస్తవానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటిది. అపారమైన ప్రజా అధికారాన్ని కలిగి ఉన్న మంత్రులు ప్రజలచే ఎన్నికైన ప్రతినిధులకు జవాబు చెప్పాల్సి ఉంటుంది కాబట్టే ప్రశ్నోత్తరాల సమయం ఉంది. లేకపోతే, ప్రజలు రోడ్లపైకి రావాల్సి వస్తుంది. మీరు పార్లమెంట్‌ను అణచివేసి మీ అసంపూర్ణ విధానాలకు దానిని రబ్బర్ స్టాంప్‌గా మార్చలేరు. మీరు యువతను విస్మరించలేరు. ఇది మా దృష్టిలో భారతదేశం కాదు!" అని సౌరవ్ దాస్ అన్నారు. నీట్ పరీక్షల అక్రమాలకు బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ నెలలో జబ్లీూ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశవ్యాప్త నిరసనలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వంతో చర్చల అనంతరం జూలై 25న ఆందోళనలను తాత్కాలికంగా విరమించినప్పటికీ, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది.

# ప్రధాని చేసిన మేధో నక్సల్స్ వ్యాఖ్యలు

# విపక్షాలను ఉద్దేశించి కాదు




పంద్రాగస్టు ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన మేధో నక్సల్స్ వ్యాఖ్యలు విపక్షాలను ఉద్దేశించి కాదని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు వివరణ ఇచ్చారు. మావోయిస్టులకు మద్దతిచ్చేవారిని, రాజ్యాంగాన్ని తిరస్కరించేవారిని ఉద్దేశించి మోదీ, అలాంటి వ్యాఖ్యలు చేశారని రిజిజు చెప్పారు. వేర్పాటువాదుల పక్షాన నిలిచేవారు, ఆర్టికల్ 370కి మద్దతిచ్చేవారు, ఈశాన్య భారతంలో చికెన్ నెక్‌ను వేరు చేయాలని పిలుపు ఇచ్చేవారినే అలా అన్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించినప్పటికీ మేధో నక్సల్స్ ముప్పు ఇంకా పొంచి ఉందని ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ శనివారం చెప్పారు. ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తప్పుబట్టారు. మేధో నక్సల్స్ అనే పదం ఎక్కడాలేదన్నారు. రెండు, మూడేళ్ల క్రితం రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అనే పదంతో ప్రధాని విమర్శించేవారిని ఆయన చెప్పారు. మేధో నక్సల్స్ అనే పదం కూడా అలాంటిదేనని అన్నారు. కుల గణన కోసం డిమాండ్ చేసే వారి ఆలోచనలు అర్బన్ నక్సల్స్ మాదిరిగా ఉన్నాయని, గతంలో ప్రధాని విమర్శించినట్లు జైరాం రమేష్ పేర్కొన్నారు. ఏడాది తర్వాత కులగణనకు ఆయన ఆదేశించారని చెప్పారు. ప్రత్యర్థులను తొలుత విమర్శించడం, తర్వాత వారి డిమాండ్లను అంగీకరించడం ప్రధానికి అలవాటేనని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలోనే మేధో నక్సల్స్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు వివరణ ఇచ్చారు.

**అసలు మోదీ ఏమన్నారు?**

దేశంలో నక్సల్? ప్రభావం తగ్గినప్పటికీ, అలాంటి భావజాలం కలిగిన వారు ఇంకా సమాజంలో ఉన్నారని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం వివిధ సంస్థలను, కార్యకలాపాలను ప్రభావితం చేసిందని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి ఏరిపారేయాల్సిన అవసరం ఉందని ఆరోపించారు. ఎందుకంటే వాళ్లు, అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, దేశాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం వికసిత్? భారత్ కోసం యువత ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించిందని పేర్కొన్నారు.

**మోదీ వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించిన సీజేపీ**

మరోవైపు, మోదీ మేధో నక్సల్స్ వ్యాఖ్యలపై కాక్రోచ్ జనతా పార్టీ కూడా ఘాటుగా స్పందించింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన చదువుకొన్న యువతపై ప్రధాని అటువంటి ముద్ర వేయడం తగదని సీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి సౌరవ్‌దాస్ మండిపడ్డారు. మీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారనే కారణంతోనే ఇలా అంటారా?' అని ప్రశ్నించారు.

"ప్రధానమంత్రి, ఇలాంటి నిందలు పనిచేయవు. చదువుకున్న యువత మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించగానే అంత మాట అనడం, పూర్తిగా దురహంకారానికి నిదర్శనం. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తి అసమర్థత" అని వ్యాఖ్యానించారు. 'గంటలు మోగుతున్నాయి. మేల్కొలుపు మొదలైంది' అని సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సహజమైన ప్రక్రియ అని, ప్రశ్నించే వారిని భయపెట్టడం లేదా ఒక ముద్ర వేయడం సరికాదన్నారు. ఇప్పటివరకు మౌనంగా ఉండాలని చెప్పిన ఒక తరం ప్రస్తుతం తనకు అందుబాటులో ఉన్న వేదికలను కనుగొంటోందని తెలిపారు. ఏదీ మారదని చెప్పిన తరం, ఇప్పుడు మార్పు సాధ్యమేనని నమ్మడం ప్రారంభించిందని అన్నారు. దేశంలో శాంతియుత నిరసనల యుగం మొదలైందని వ్యాఖ్యానించారు. ప్రజలు తమ సమస్యలపై ప్రశాంతంగా నిరసన తెలిపేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో నెలకొన్న భయం బంధనాల నుంచి విముక్తం కావడంతో, బహుశా పన్నెండేళ్ల తర్వాత ఇది దేశ ప్రజలు జరుపుకొంటున్న అసలైన స్వాతంత్ర్య దినోత్సవమని సౌరవ్ మరో ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

## 'వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించింది

జాతీయ గేయం వందేమాతరంను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఈ గేయాన్ని రచించిన బంకిం చంద్ర చటోపాధ్యాయతోపాటు దేశ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్ చిత్తోర్‌గఢ్‌లో జరిగిన ఓ సభలో పాల్గొన్న అమిత్ షా, శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో వందేమాతరం గేయాన్ని మధ్యలోనే ఆపేయాలని సోనియా కోరినట్లు ఆరోపించారు. ఆ దృశ్యాలను దేశమంతా టీవీల్లో చూసిందన్నారు. వందేమాతరాన్ని పాడినందుకు స్వాతంత్ర్య సమరయోధులు తూటాలు, లాఠీ దెబ్బలను తిన్నారని, జైలు పాలయ్యారని అమిత్ షా గుర్తు చేశారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే హస్తం పార్టీ వందేమాతరం గేయాన్ని మరిచిపోయిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచిన తర్వాత ఎర్రకోటతో పాటు జెండా ఆవిష్కరణ జరిగిన అన్ని చోట్లా వందేమాతరం ఆలపించారని తెలిపారు. "సోనియా జీ, 140 కోట్ల మంది ప్రజలు మిమ్మల్ని గమనిస్తున్నారు. మీరు చేసిన ఈ పాపాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. 'వందేమాతరం' గేయాన్ని అసంపూర్ణంగా వదిలేయాలని ఎవరైనా ఎలా ఆలోచించగలరు? కాంగ్రెస్ పార్టీ దీనికి సిగ్గుపడాలి" అని అన్నారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన 'అటల్ గౌరవ్ స్మృతి సమారోహ్'లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన 21 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించారు. పోఖ్రాన్ పరీక్షల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారతదేశాన్ని అణు శక్తిగా మార్చడంతో సహా వాజ్‌పేయీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. వాజ్‌పేయి ప్రభుత్వం తన హయాంలో గ్రామాలను రోడ్లతో అనుసంధానించిందని, జాతీయ రహదారులను నిర్మించిందని గుర్తుచేశారు. గిరిజన అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత కూడా వాజ్‌పేయీదేనని ఆయన కొనియాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గిరిజన సంక్షేమానికి నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.

**సోనియా గాంధీపై బీజేపీ నేతల ఫిర్యాదు**

మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఆదివారం కర్ణాటకలోని ఉర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ప్రవర్తన జాతీయ గేయాన్ని అగౌరవపరచడమేనని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకత్వం జాతీయ గేయం 'వందేమాతరం' పట్ల తీవ్రమైన అగౌరవాన్ని కలిగి ఉందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాలపై దుమారం రేగింది. జెండావందనం సందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తల్లి, తనయుడు, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పూర్తి వందేమాతరాన్ని ఆలపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదని, కొందరి ఆలోచనాధోరణి 1947కి పూర్వం ఎలా ఉందో ఆ తర్వాతా అలాగే ఉందని విమర్శించారు. వందేమాతరం పూర్తి గేయాన్ని ఎందుకు వేశారంటూ కార్యకర్తల్ని సోనియా ప్రశ్నించారని, అది ఎంతో సిగ్గుచేటు అని బీజేపీ అధికార ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ మండిపడ్డారు. అయితే, బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. వివాదమేమీ లేదని కొట్టిపారేసింది. ఎక్కువసేపు నిల్చొని ఉన్న ఖర్గేకు కుర్చీ వేయాల్సిందిగా సోనియా సైగ చేశారని, గేయాన్ని ఆపాలని కాదని క్లారిటీ ఇచ్చింది.

## 'నా మిత్రులు నన్ను కలవడానికి వచ్చాయి'



ప్రధాని నరేంద్రమోదీ తన దైనందిన జీవితంలో వన్యప్రాణులకు ఎంత ప్రాముఖ్యత ఇస్తారో అందరికీ తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో తన నివాసంలో ఆవులు, నెమళ్లతో కొంత సమయం గడిపారు. వాటికి ఆహారం అందిస్తూ, ఆప్యాయంగా ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన సోషల్ మీడియా వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. సాధారణంగా రోజూ ఉదయం వాటికి ఆహారం అందిస్తానని మోదీ పేర్కొన్నారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాను ముందుగానే బయలుదేరాల్సి రావడంతో, తన జంతు మిత్రులు కూడా ఆ విషయాన్ని పసిగట్టినట్టుగా అనిపించిందన్నారు. అందుకే ఎర్రకోటకు బయల్దేరే సమయంలో తనను కలిసేందుకు వచ్చాయని తెలిపారు. చివర్?లో 'స్పెషల్? యాజ్? ఆల్వేస్' అని ఇన్స్టా పోస్ట్?లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్? మీడియా తెగ వైరల్ అవుతోంది.

ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల్లో తన అధికారిక కార్యక్రమాలతో పాటు ప్రకృతి, జంతువులకు సంబంధించిన వ్యక్తిగత అనుభవాలను కూడా అప్పుడప్పుడూ పంచుకుంటుంటారు. తాజా పోస్టు కూడా అలాంటి అరుదైన వ్యక్తిగత కోణాన్ని ఆవిష్కరించింది. దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆయన షెడ్యూల్ సాధారణంగా అత్యంత బిజీగా ఉంటుంది. జాతీయ పతాకావిష్కరణ, దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగం, ఇతర అధికారిక కార్యక్రమాల మధ్య, ఉదయం తన జంతు మిత్రులతో గడిపిన క్షణాలను పంచుకోవడం ప్రత్యేకంగా నిలిచింది.

**ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ**

జంతు మిత్రులతో ఆత్మీయ సమయాన్ని గడిపిన అనంతరం మోదీ ఎర్రకోటకు చేరుకున్నారు. అక్కడ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నేతృత్వం వహించారు. చారిత్రక ఎర్రకోట ప్రాకారాలపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వదేశీ 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21 తుపాకుల గౌరవ వందనం నిర్వహించారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని, 2047 నాటికి భారత్‌ను 'వికసిత్ భారత్'గా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని మరోసారి ప్రస్తావించారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. దేశ ఆర్థిక ప్రగతి, తయారీ రంగం, సాంకేతికత, ఆవిష్కరణలు, రక్షణ, మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రసంగంలో ప్రాధాన్యత కనిపించింది. కీలక రంగాల్లో విదేశీ ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. తయారీ రంగంతో పాటు ఆహార ప్రాసెసింగ్, సాంకేతిక పరిజ్ఞానం, కనెక్టివిటీ, రక్షణ రంగం, పచ్చ ఆర్థిక వ్యవస్థ, సముద్ర ఆధారిత ఆర్థిక రంగం వంటి వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

**బన్నీ గడ్డిభూముల్లో 20 కృష్ణజింకలు**

ఇదిలా ఉండగా, 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, గుజరాత్‌లోని కచ్‌లో ఉన్న బన్నీ గడ్డిభూముల్లో 20కృష్ణ జింకలను విడిచిపెట్టారు. స్థానికంగా వన్యప్రాణుల సంఖ్యను పెంచడానికి, బన్నీ గడ్డిభూముల్లో పర్యావరణ వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి గుజరాత్ అటవీ శాఖ, వంతారా సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి. స్థానికంగా శాకాహార జంతువులను తిరిగి ప్రవేశపెట్టడం ఆహార గొలుసును సమతుల్యం చేయడం, స్థానిక పర్యావరణం కోలుకునేలా సహాయపడటం దీని ప్రధాన ఉద్దేశ్యమని అటవీశాఖ, వంతారా తెలిపాయి. వంతారా బృందం ఈ కృష్ణ జింకలకు అత్యుత్తమ వైద్య పరీక్షలు, సురక్షితమైన రవాణా ఏర్పాట్లను చేసింది. కృష్ణ జింకలు వంటి శాకాహార జంతువులను తిరిగి తేవడం ద్వారా బన్నీ గడ్డిభూముల్లో విస్తృత జీవవైవిధ్యం పెంపొందుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది. భవిష్యత్తులో మరిన్ని జంతువులను ప్రవేశపెట్టే ప్రణాళికలకు అనుకూలంగా పర్యావరణాన్ని సన్నద్ధం చేయడానికి ఇది ఎంతగానో సహాయపడుతుందని తెలిపింది.

# నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

సాగనున్నాయి. దీంతో సభలో ప్రభుత్వం ఏ అంశాలను ముందుకు తెస్తుంది? వైసీపీ చేస్తున్న ఆరోపణలకు అధికార పక్షం సభా వేదికగా ఎలాంటి సమాధానాలు ఇస్తుంది? మరోవైపు సభకు దూరంగా ఉన్న జగన్ ప్రభుత్వంపై ఎలాంటి రాజకీయ దాడి కొనసాగిస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది.

**జగన్ రూటే సెపరేటు**

ప్రతిపక్ష నేత హోదా అంశంపై జగన్ తన వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశారు. అసెంబ్లీలో తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా సమావేశాలకు హాజరుకావడంలో అర్థం లేదన్నది వైసీపీ వాదన. అందుకే తాను మాత్రమే కాకుండా పార్టీ ఎమ్మెల్యేలు కూడా సమావేశాలకు హాజరుకాబోరని జగన్ ప్రకటించారు. సభకు దూరంగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, ఎన్నికల హామీల అమలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తామని వైసీపీ చెబుతోంది. ఇక్కడే అధికార కూటమి, వైసీపీ మధ్య ప్రధాన రాజకీయ వివాదం నెలకొంది. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలను ప్రస్తావించాలని అధికార పక్షం అంటుంటే.. ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన హోదా, హక్కుల విషయంలో ప్రభుత్వం రాజకీయంగా వ్యవహరిస్తోందన్నది వైసీపీ వాదన. ఈ రెండు వాదనల మధ్య అసెంబ్లీ సమావేశాలు మరోసారి రాజకీయ వేదికగా మారనున్నాయి.

**అయ్యన్న సవాల్‌తో మరింత వేడి**

ఈ నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. జగన్ అసెంబ్లీకి వచ్చి వైసీపీ చేస్తున్న ఆరోపణలను సభలో ప్రస్తావించాలని ఆయన సూచించారు. డీఎస్సీతో సహా వైసీపీ లేవనెత్తే ప్రతి అంశంపైనా సంబంధిత మంత్రులు, ప్రభుత్వం చేత సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. సభ వెలుపల ఆరోపణలు చేయడం కంటే సభకు వచ్చి ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నది స్పీకర్ వాదన. దీంతో 'ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నప్పుడు సభకు వచ్చి ఎందుకు ప్రశ్నించడం లేదు?' అన్న ప్రశ్నను అధికార కూటమి వైసీపీ వైపు సంధించే అవకాశముంది.

**హోదాపైనే పట్టు**

మరోవైపు ప్రతిపక్ష నేత హోదా విషయంలోనూ స్పీకర్ తన వైఖరిని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అవసరమైన సంఖ్యాబలం లేనప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదని ఆయన చెబుతున్నారు. వైసీపీ మాత్రం ఈ వాదనను అంగీకరించడం లేదు. ప్రతిపక్షంలో అత్యధిక స్థానాలున్న పార్టీ నాయకుడికి ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని వాదిస్తోంది. దీంతో అసెంబ్లీ సమావేశాల్లో చర్చించే అంశాలతో పాటు 'జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా' వ్యవహారం కూడా సభ వెలుపల ప్రధాన రాజకీయ చర్చగా కొనసాగనుంది. అధికార కూటమి, వైసీపీ రెండూ ఈ అంశాన్ని తమ తమ రాజకీయ వాదనకు అనుకూలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి.

**డీఎస్సీ.. హాట్ టాపిక్**

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో డీఎస్సీ అంశం ప్రధాన చర్చనీయాంశాల్లో ఒకటిగా మారింది. డీఎస్సీ నియామకాల విషయంలో అక్రమాలు జరిగాయని వైసీపీ ఆరోపిస్తోంది. ముఖ్యంగా కొన్ని నియామకాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదంటూ ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను తిప్పికొడుతోంది. ఇదే అంశాన్ని సభలో ప్రస్తావిస్తే పూర్తి వివరాలతో సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న సంకేతాలు అధికార పక్షం నుంచి వస్తున్నాయి. స్పీకర్ కూడా డీఎస్సీ సహా అన్ని అంశాలపై సమాధానాలు ఇప్పిస్తానని ప్రకటించడంతో ఈ అంశం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడంతో డీఎస్సీపై నేరుగా ప్రశ్నలు–-సమాధానాల రూపంలో అధికార, ప్రతిపక్షాల మధ్య చర్చ జరిగే అవకాశం ఉండదు. ప్రభుత్వం సభలో తన వాదనను వినిపిస్తే.. వైసీపీ సభ వెలుపల నుంచి దానికి కౌంటర్ ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

**మండలిలో మాత్రం ముఖాముఖి**

అసెంబ్లీకి దూరంగా ఉండాలని నిర్ణయించిన వైసీపీ.. శాసనమండలిలో మాత్రం తన బలాన్ని ఉపయోగించుకోవాలని చూస్తోంది. పార్టీ ఎమ్మెల్సీలు సమావేశాలకు హాజరై ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలపై ప్రశ్నలు సంధించనున్నారు. దీంతో ఈసారి అధికార, ప్రతిపక్షాల మధ్య అసలు ముఖాముఖి రాజకీయ పోరు మండలిలోనే కనిపించే అవకాశం ఉంది. డీఎస్సీ, విద్య, ఉద్యోగాలు, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తదితర అంశాలను మండలిలో వైసీపీ ప్రస్తావించే అవకాశముంది. ప్రభుత్వం కూడా ప్రతిపక్ష ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. దీంతో అసెంబ్లీ కంటే మండలి సమావేశాలు వాడీవేడిగా సాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**ప్రభుత్వం ఏం చెబుతుంది?**

అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం కూడా రాజకీయంగా కీలక వేదికగా ఉపయోగించుకునే అవకాశముంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలు, ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన తదితర అంశాలను సభ ద్వారా ప్రజలకు వివరించేందుకు సిద్ధమవుతోంది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు, పోలవరం, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం ప్రస్తావించే అవకాశముంది. గత ప్రభుత్వ పాలనతో ప్రస్తుత పరిస్థితులను పోల్చుతూ అధికార పక్ష సభ్యులు వైసీపీపై ఎదురుదాడికి దిగే అవకాశమూ లేకపోలేదు.

**సభలో ప్రతిపక్షం లేకపోతే..?**

ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి దూరంగా ఉండటం సహజంగానే రాజకీయ చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం, అధికార పక్షాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ప్రతిపక్షం ప్రధాన బాధ్యతల్లో ఒకటని అధికార కూటమి నేతలు వాదిస్తున్నారు. వైసీపీ మాత్రం సభలో తమకు తగిన హోదా, అవకాశాలు కల్పించకుండా కేవలం హాజరు కావాలని కోరడం సరికాదని చెబుతోంది. దీంతో 'సభకు ఎందుకు రావడం లేదు?' అన్న అధికార పక్ష ప్రశ్నకు.. 'ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదు?' అన్న ప్రశ్నతో వైసీపీ సమాధానం ఇస్తోంది. సమావేశాల సమయంలో ఈ రాజకీయ సంవాదం మరింత ముదిరే అవకాశముంది.

బీఏసీలో ఎజెండా ఖరారు

సభ ప్రారంభానికి ముందు జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో శాసనసభ పనిదినాలు, ఎజెండాపై నిర్ణయం తీసుకోనున్నారు. ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలి? ఏ అంశాలను చర్చకు తీసుకోవాలి? ప్రభుత్వం ఎన్ని బిల్లులు ప్రవేశపెట్టనుంది? ప్రశ్నోత్తరాలు, స్వల్పకాలిక చర్చలు, ఇతర శాసన వ్యవహారాలకు ఎంత సమయం కేటాయించాలి? వంటి అంశాలు బీఏసీలో ఖరారు కానున్నాయి. ప్రొవిజనల్ షెడ్యూల్ ప్రకారం సమావేశాలు నాలుగు రోజుల పాటు సాగనున్నప్పటికీ బీఏసీ నిర్ణయమే కీలకం కానుంది. ప్రభుత్వం తీసుకురానున్న బిల్లులు, తీర్మానాలు కూడా సమావేశాల రాజకీయ ప్రాధాన్యాన్ని నిర్ణయించనున్నాయి.

# జెండా, అజెండా భారత్...

**విజయవాడ :** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్ట్ చేశారు. దేశ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడమే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ఇచ్చే నిజమైన నివాళి అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు."ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యం. దేశం నాకు ఏం చేసిందని కాకుండా, దేశానికి నేను ఏం చేయగలనని ప్రతి ఒక్కరూ 'అనే నేను..' సంకల్పంతో ఆలోచించాలి" అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి చేతిలో జాతీయ జెండా, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' సాధించాలన్న లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు కోరారు. 0వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు. "ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యం. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమే. అందుకు 'అనే నేను...' సంకల్పంతో దేశం నాకు ఏం చేసిందని కాదు... దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలి. మన చేతిలో జాతీయ జెండా ఉండాలి... మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలి. 2047 నాటికి వికసిత్ భారత్... స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు... వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దాం." అని పిలుపునిచ్చారు. మన స్వాతంత్ర్య సమరయోధుల, దార్శనిక నాయకుల నుంచి శాశ్వతమైన స్ఫూర్తిని పొంది, వారి స్ఫూర్తిని దేశ నిర్మాణ కార్యంలో ముందుకు తీసుకువెళ్దాం. మన యువత స్పష్టమైన లక్ష్యంతో, నైతిక ధైర్యంతో నాయకత్వం వహించాలి. రాజకీయ విభజనలకు, సామాజిక విభేదాలకు అతీతంగా ఎదగాలి. ప్రతి పల్లెటూరు, పట్టణం, నగరంలోని ప్రతి పౌరుడు, రాబోయే తరాల కోసం బలమైన, సుసంపన్నమైన, స్వయం సమృద్ధిగల, నిజమైన వికసిత భారత్‌ను నిర్మించడానికి చిత్తశుద్ధితో తమ వంతు కృషి చేయాలి." అని రాసుకొచ్చారు. ఇది మన సమిష్టి ధర్మం అని, ఇది మన ఉమ్మడి గమ్యం అని పేర్కొన్నారు. ."100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు, వికాసం నుంచి వైభవం వైపు సాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకోవడానికి ఐక్యంగా అడుగులు వేద్దాం" అని ఆయన తెలిపారు. తన సందేశాన్ని 'జై తెలుగుతల్లి! జై హింద్!' నినాదాలతో ముగించారు

పవిత్ర బాధ్యతగా భావించాలి: పవన్

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, తమ ధైర్యం, త్యాగం, దేశభక్తితో మనం ఈరోజు అనుభవిస్తున్న స్వేచ్ఛను సాధించిన స్వాతంత్ర్య సమరయోధులకు హృదయపూర్వక నివాళులు అర్పించారు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. "మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ తేలికగా తీసుకోవలసిన బహుమతి కాదని, అది మన జాతీయ ఐక్యత, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడటానికి చేపట్టిన ఒక పవిత్ర బాధ్యత అని వారి జీవితాలు మనకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయి.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గడిచిన దశాబ్దాల్లో, దేశం నిశ్శబ్దమైన సంకల్పంతో, అద్భుతమైన ఆశయంతో ఎదిగింది. ప్రపంచ అంతరిక్ష శక్తిగా ఆవిర్భవించడం, చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో చారిత్రాత్మక ల్యాండింగ్ అవ్వడం నుంచి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడం, యూపీఐ ద్వారా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను సృష్టించడం, మన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడం, ప్రపంచ వేదికపై ఒక ప్రధాన ఆర్థిక శక్తిగా స్థిరపడటం వరకు – ఈ విజయాలు భారత ప్రజల ప్రతిభకు, అకుంఠిత స్ఫూర్తికి సజీవ నిదర్శనం.విభజనతో దెబ్బతిన్న దేశాన్ని వారసత్వంగా పొంది, ఐక్యత, పునర్నిర్మాణం, ప్రగతి అనే ఉన్నత మార్గాన్ని ఎంచుకున్న ఆ మహనీయ రాజనీతిజ్ఞులకు, జాతినిర్మాతలకు నేను ప్రగాఢ గౌరవంతో నమస్కరిస్తున్నాను. వారి దార్శనికత, ధైర్యసాహసాలతో, నేడు మనం గర్వంగా నివసిస్తున్న ఈ భారత్‌కు వారు పునాదులు వేశారు.

# గోదావరి పుష్కరాలకు 1000 కోట్లు

**హైదరాబాద్ :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ పుష్కరాల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'గోదావరి పుష్కరాలు-2027'పై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా జరుగుతున్న పురోగతిని కమిటీ సభ్యులు సమీక్షించి, అధికారులకు కీలక సూచనలు చేశారు.భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే 'టైర్-1' ప్రాంతాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా సీనియర్ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు.పుష్కరాలకు వచ్చే



భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి, స్థానిక నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పండితులను భాగస్వాములను చేయాలని సూచించారు. భక్తులకు సేవ చేసేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే పుష్కరాలు విజయవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు

-మొదటిపేజీ తరువాయి

అనుమతి రాగానే ప్రక్రియ మొదలు కానుంది.

**4 నగరాల్లో ప్రతిపాదిత ప్రాజెక్టులు**

ఈ పథకం కింద ప్రాజెక్టు అంచనా వ్యయంలో 25 శాతం నిధులను కేంద్రం గ్రాంట్‌గా అందించనుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంస్థలు సమకూర్చాల్సి ఉంటుంది. రెండో విడతలో విజయవాడకు భారీగా నిధులు ప్రతిపాదించారు. కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు రూ.600 కోట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు స్కాడా విధానం అమలుకు మరో రూ.300 కోట్లు ప్రతిపాదించారు. నెల్లూరులో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించేలా రూ.120 కోట్ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి రెండు దశల్లో 130 కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాజమహేంద్రవరానికి కూడా పలు కీలక ప్రాజెక్టులు ప్రతిపాదించారు. 20 కోట్లతో పీపీపీ విధానంలో మల్టీలెవెల్ కారు పార్కింగ్, 120 కోట్లతో గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నారు. మరో 100 కోట్లతో పీపీపీ విధానంలో కమర్షియల్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గుంటూరులో 300 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ అభివృద్ధికి 100 కోట్లు, తాగునీటి సరఫరా విభాగంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు మరో 100 కోట్లు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాజెక్టులకు రాష్ట్ర వాటా నిధులను సమకూర్చడం కీలకంగా మారింది. ఇందుకోసం హడ్కో నుంచి రుణం తీసుకునే ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. నగరపాలక సంస్థల పరిధిలో మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సమీకరించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది.

## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు తొలగుతున్న అడ్డంకి

-మొదటిపేజీ తరువాయి

యంత్రంలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దీంతో పనులు నిలిపివేశారు. సహజసిద్ధంగా బ్లాస్టింగ్ చేసి కాంక్రీట్ పూతతో మిగతా పనులు చేపట్టారు. ఇవి దాదాపు పూర్తికాగా, ఈ నెల 22న ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఇక్కడ చిక్కుకుపోయిన యంత్రం బయటకు తీయడం సవాల్?గా మారింది. 180 మీటర్ల పొడవు, వెయ్యి టన్నులకుపైగా బరువు ఉన్న ఈ యంత్రాన్ని బయటకు తీసుకురావాలంటే ముక్కలుగా చేసి తరలించడం తప్ప మరో మార్గం లేదు. ఈ పనిని మే 29న ప్రత్యేక నిపుణులకు అప్పగించారు. వారు యంత్రం వెనుక వైపు నుంచి ఒక్కో భాగాన్ని వెల్డింగ్‌తో తొలగించడం ప్రారంభించారు. అనంతరం ఆ భాగాలను టిప్పర్‌లో బయటకు తీసుకొస్తున్నారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. చివరగా టీబీఎంలో ఉండే కట్టర్ హెడ్‌ను తొలగించాల్సి ఉంది. ఇందుకోసం డైమండ్ కటింగ్‌లో నైపుణ్యం ఉన్న కార్మికులను తీసుకొచ్చారు. వారంలోగా పనులన్నీ పూర్తిచేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూస్తామని ఈఈ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

**కార్మికుల భద్రతకు అధికారుల చర్యలు**

మరోవైపు టన్నెల్‌లో పనులకు వెళ్లే కార్మికుల భద్రతకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. టన్నెల్‌లోకి వెళ్లే ప్రతి కార్మికుడికి ముందుగా ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్నారు. టీబీఎం తొలగింపు, గ్యాస్ కట్టింగ్ పనులు చేసే సిబ్బందికి ప్రత్యేక దుస్తులు, మాస్కులు, చెవుల రక్షణ పరికరాలు అందిస్తున్నారు. వాహనాల రాకపోకల కోసం ప్రతి 400 మీటర్లకు రెడ్ సిగ్నల్, వాహనాలు పక్కకు తప్పుకునే ప్రాంతాలు ఏర్పాటు చేశారు. కార్మికుల కోసం అంబులెన్స్‌తో పాటు మెయిన్ సైట్‌లో 24 గంటలూ వైద్యుడు అందుబాటులో ఉంటారని వెలిగొండ భద్రతా అధికారి మంజునాథ్ వివరించారు.

## విశాఖకు విమానాల రాకపోకలు బంద్

-మొదటిపేజీ తరువాయి

కొందరు నగరవాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతలా వారికి దానితో అనుబంధం పెనవేసుకుపోయింది.

1941లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖ ఎయిర్?పోర్ట్?కి పునాది పడింది. రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అవసరాల కోసం బ్రిటిష్ పాలకులు ఈ ఎయిర్ ఫీల్డ్ నిర్మించారు. 'వింటేజ్ ఆర్కిటెక్' ముప్పిడి కుటుంబానికి రన్ వే నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. 45 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఎత్తైన గుట్టలతో నిండిన ప్రాంతాన్ని వేగంగా చదును చేసి అనుకున్న సమయానికంటే ముందే రన్‌వే నిర్మించి ఇచ్చారు. తొలి పౌర విమాన రాకపోకలు (సివిల్ ఆపరేషన్స్) 1954లో ప్రారంభం కాగా నాడు రాకపోకలకు చాలా తక్కువగా అనుమతులిచ్చారు. పూర్తిస్థాయి వాణిజ్య విమాన సర్వీసులు 1981లో మొదలయ్యాయి. అప్పటి నుంచి పూర్తి సివిల్ ఎయిర్‌పోర్టుగా ఆపరేషన్స్ ప్రారంభమయ్యాయి. వ్యూహాత్మక భద్రతా కారణాలతో 1986లో భారత నావికాదళం చేతిలోకి ఈ ఎయిర్?పోర్ట్? వెళ్లింది. 1991లో దీనికి 'ఐఎన్ఎస్ డేగ' అని నామకరణం చేశారు. అప్పటి నుంచి నేవీ నియంత్రణలో ఉంటూ పౌర విమాన సర్వీసులు నడుపుతున్నారు.

పాత రన్‌వే కేవలం ఆరు వేల అడుగులు మాత్రమే ఉండటంతో పెద్ద విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీన్ని అధిగమించడానికి 10,007 అడుగుల రన్‌వేను నిర్మించి 2007 జూన్ 15న ప్రారంభించారు. దీంతో బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఏ320 వంటి భారీ వాణిజ్య విమానాల రాకపోకలకు మార్గం సుగమమైంది. రూ.95 కోట్లతో సరికొత్త ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని 2009 ఫిబ్రవరి 20న ప్రారంభించారు. ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) రాత్రివేళల్లో విమానాలు దిగే సాంకేతికత (నైట్ ల్యాండింగ్) 2012లో అందుబాటులోకి వచ్చింది. అదే సంవత్సరం ఎయిర్ ఇండియా సింగపూర్‌కు మొట్టమొదటి అంతర్జాతీయ సర్వీసు ప్రారంభించడంతో విశాఖ గ్లోబల్ ఏవియేషన్ మ్యాప్‌లో నిలిచింది. మరోవైపు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం (ఆగస్టు 17) నుంచి విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో విశాఖ ఎయిర్?పోర్ట్? నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ఇప్పటికే ప్రకటించింది. 30 సంవత్సరాల పాటు వైజాగ్ విమానాశ్రయం నుంచి (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని పౌరవిమానయానశాఖ పేర్కొంది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని తెలిపింది. ఇప్పటి వరకు విశాఖ విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' సోమవారం (ఆగస్టు 17) అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం వెల్లడించింది.

తొలి విమానం దేశీయమే

వాస్తవానికి భోగాపురం ఎయిర్?పోర్ట్? నుంచి సింగపూర్‌కు తొలి విమానం ఇవాళ బయల్దేరుతుందని అనుకున్నారు. కానీ సోమవారం (ఆగస్టు 17)న ఉదయం సర్వీసులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భోగాపురం నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, దిల్లీ, ముంబయి, కోల్‌కతా, తిరుపతికి ఇండిగో సంస్థ తొలి రోజు 31 సర్వీసులు నడపడానికి ప్రణాళిక రూపొందించింది. భోగాపురం విమానాశ్రయం నుంచి రాకపోకలపై విమానయాన సంస్థలు ఒక్కొక్కటిగా తమ షెడ్యూళ్లను విడుదల చేస్తున్నాయి. మరోవైపు నేటి అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానుండగా అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి వెళ్లనున్నాయి.

బయల్దేరే సర్వీసులివే

భోగాపురం నుంచి హైదరాబాద్‌కు సోమవారం(ఆగస్టు 17)న ఉదయం 8.55, 10.40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4.25, రాత్రి 7.20, 8.40, 9.20 గంటలకు బయల్దేరనున్నాయి. దిల్లీకి ఉదయం 8.20, రాత్రి 10.45, బెంగళూరుకు మధ్యాహ్నం 2.55, రాత్రి 9.10, చెన్నైకి మధ్యాహ్నం 12.15, సాయంత్రం 6.35, కోల్‌కతాకు రాత్రి 7.50, ముంబయికి మధ్యాహ్నం 3.05, తిరుపతికి మధ్యాహ్నం 1.50 గంటలకు విమానాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

# చలక్ష్యంతోనే ఉన్నత శిఖరాలను చేదింపు సాధ్యం





**విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం:యర్రగుంట జయన్న**

**గుంతకల్లు ఆగస్టు 16 (ప్రజా జ్యోతి):** సమాజంలో విద్యార్థిని, విద్యార్థులు విద్యాభ్యాసం చేసే నాటి నుంచి లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు చేదించడం సాధ్యమని యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ ఌ సామాజిక సేవా కార్యకర్త.యర్రగుంట జయన్న అన్నారు. ఆదివారం గుత్తి పట్టణంలో ఉన్న శ్రీసాయి కళాశాలలో గుత్తి బ్రాంచి యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ లో కోర్సు పూర్తి చేసిన విద్యార్థు లకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గుంతకల్లు యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ, డైరెక్టర్ యర్రగుంట. జయన్న హాజరైనారు. ఈసందర్భంగా విద్యార్థు లను ఉద్దేశించి ప్రసంగిం చారు. గత ఇరవై సంవత్సరాలుగా అనేక సామాజిక సేవా కార్యక్ర మాలు చేస్తూ ముందుకు వెళుతున్నట్లు అమ్మ నాన్న లేని పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ను అందిస్తూ మరియు పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించడం, మరియు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యో గులకు ఉచితంగా మెటీరి యల్స్ పంపిణీ చేయడం హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఉన్న అభాగ్యుల కు నా వంతు సహాయంగా ఆర్థిక సాయం అందిస్తూ ఉంటాను అని చెప్పారు.విద్యార్థులు పరీక్షలు అంటే భయం వీడి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజం గర్వపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జయన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష సమయంలో ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళిక బద్ధంగా చదువుకొని మంచి మార్కు లతో ఉత్తీర్ణత సాధించి మీ తల్లి తండ్రులుకు మరియు ఉపాద్యాయులుకు, మీ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపు నిచ్చారు. ప్రపంచాన్ని శాసించే ఆయుధం ఒక చదువుకు మాత్రమే ఉందన్నారు.విద్యే మనిషిని భగవంతుణిని, భాగ్యవంతు డును మహానుభావుడును చేస్తుందన్నారు. ఈ పోటీ ప్రపంచంలో రాణించడానికి పాఠ్య పుస్తక జ్ఞానంతో పాటు కొత్త ఆలోచనలతో, కొత్త నైపుణ్యాలతో సాంకేతి క పరంగా ముందకురావాల ని సూచించారు.

# 2029లో బిజెపి ఓటమి ఖాయం





**సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్**

**పోరుమామిళ్ల ఆగస్టు 16 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** బిజెపి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలపై నిర్బంధ చట్టాలు ప్రయోగించి అష్టకష్టాలు పాలు చేశారని, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల 2029లో జరిగే 19వ సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయమని సీపీఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ స్పష్టం చేశారు.ఆదివారం ఉదయం పోరుమామిళ్లలోని ఒక ప్రైవేటు కళాశాలలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో "ప్రాంతీయ శాస్త్రీయ రాజకీయ శిక్షణా తరగతులు" నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.గౌసియా బేగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడారు.నిర్బంధ చట్టాల వినియోగం నరేంద్ర మోడీ నాయకత్వంలోని 12 ఏళ్ల కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు, విద్యార్థి ఉద్యమ నాయకులపై ఊపా పిఎస్ఏ వంటి కఠిన చట్టాలను తెచ్చి ప్రజల గొంతు నొక్కిందని ఆరోపించారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి, పార్లమెంటులో రాజ్యాంగ విరుద్ధంగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల ద్వారా ప్రజా వ్యతిరేక బిల్లులను ఆమోదింప జేశారని విమర్శించారు.చారిత్రక అంశాలు గతంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి 1959 నుండి ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేసిందని, 1975లో ఎమర్జెన్సీ విధించిందని గుర్తుచేశారు. ఆ విధానాల వల్లే కాంగ్రెస్ పార్టీ నేడు ప్రాంతీయ పార్టీల స్థాయికి దిగజారిందన్నారు.ఎన్నికలపై ప్రభావం ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి డబ్బు, నకిలీ ఓటర్లు, మత-ప్రాంతీయ విభజన రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయకుండా డీలిమిటేషన్‌తో ముడిపెట్టి కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.18వ సార్వత్రిక ఎన్నికల తీర్పు బిజెపి ఆధిపత్య రాజకీయాలకు వ్యతిరేకంగా 18వ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, అందుకే నేడు టీడీపీ, జేడీయూ (బాబు, నితీష్)ల మద్దతుపై ఆధారపడి మైనార్టీ ప్రభుత్వంగా నడుస్తోందని పేర్కొన్నారు. యువత, రైతాంగ ఉద్యమాలు రైతాంగ, విద్యార్థి, యువజన, జెన్-జీ ఉద్యమాలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తాయని, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి సోషలిస్టు భావాల వైపు యువతను నడిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ శిక్షణా తరగతులలో సీపీఎం పోరుమామిళ్ల మండల కార్యదర్శి ఎన్.భైరవ ప్రసాద్, శాఖ కార్యదర్శులు బేబీ, మేరీ, ప్రకాష్, సోమయ్య, ఓబులమ్మ, రవి, బాల వీరయ్య, మహబూబ్ పీరా, దస్తగిరి అమ్మ, రహమత్, రమణయ్య, రాజుతో పాటు పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్లార్తి గ్రామంలో వీధిలైట్ల సమస్యకు పరిష్కారం





**వైకుంఠం జ్యోతి చొరవతో గ్రామంలోని ప్రతి విద్యుత్ స్తంభానికి కొత్త వీధిలైట్లు ఏర్పాటు**

**హొళగుంద, ఆగస్టు 16, ప్రజా జ్యోతి న్యూస్ –** హొళగుంద మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో నెలకొన్న వీధిలైట్ల సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలోని పలు వీధుల్లో లైట్లు లేక రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్లార్తి బోయ మల్లికార్జున, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యపై వెంటనే స్పందించిన వైకుంఠం జ్యోతి సంబంధిత అధికారులతో మాట్లాడి వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.వైకుంఠం జ్యోతి చొరవతో ఆదివారం ఎల్లార్తి గ్రామంలోని ప్రతి విద్యుత్ స్తంభానికి కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్లార్తి బోయ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీడీపీ యువ నాయకుడు ఎల్లార్తి చిదానంద, మాల రామప్ప, శేషప్ప తదితరులు దగ్గరుండి వీధిలైట్ల ఏర్పాటును పర్యవేక్షించారు. దీంతో ఎల్లార్తి గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు పలు కాలనీల్లో వెలుగులు నిండాయి. రాత్రివేళల్లో ప్రజలకు భద్రతతో పాటు రాకపోకలకు సౌకర్యం కలగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్న వైకుంఠం జ్యోతికి ఎల్లార్తి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. వీధిలైట్ల ఏర్పాటులో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్లార్తి బోయ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీడీపీ యువ నాయకుడు ఎల్లార్తి చిదానంద, మాల రామప్ప, శేషప్పలను గ్రామస్తులు అభినందించారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు స్పందిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎల్లార్తి గ్రామానికి వీధిలైట్ల సమస్యను పరిష్కరించినందుకు వైకుంఠం జ్యోతి,వైకుంఠం ప్రసాద్ లకు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ముద్రగడ కుటుంబాన్ని పరామర్శించిన పెద్దిరెడ్డి..



**శంఖవరం: ఆగస్టు 16, (ప్రజా జ్యోతి న్యూస్)** దివంగత నాయకులు ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి పరామర్శించారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి విచ్చేసిన రామచంద్రరెడ్డి, మిధున్ రెడ్డి కలిసి ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు.అనంతరం వైఎస్ఆర్సిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు, ముద్రగడ బాలు మరియు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో పార్టీ ఎల్లప్పుడూ ముద్రగడ కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, మాజీ మంత్రులు తోట నరసింహం, పేర్ని నాని, కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, జ్యోతుల చంటిబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, దవులూరి దొరబాబు, తోట రాంజీ ముదునూరి మురళీకృష్ణ రాజు, వైయస్ఆర్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ గ్రంథ పాలకురాలు అవార్డు అందుకున్న జోగారత్నం.

**అభినందించిన జిన్నూరు శాఖా గ్రంధాలయం అభివృద్ధి కమిటీ.**



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు 16.** జిన్నూరు శాఖా గ్రంధాలయం గ్రంథ పాలకురాలు బత్తుల జోగారత్నం జిల్లా ఉత్తమ గ్రంథ పాలకురాలుగా అవార్డు అందుకోవటం పట్ల గ్రంధాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. భీమవరం లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో ఉత్తమ గ్రంథ పాలకురాలు అవార్డును రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ల చేతులమీదుగా బత్తుల జోగారత్నం అందుకున్నారు. జిన్నూరు గ్రామ ప్రముఖులు, శాఖా గ్రంధాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పెన్మెత్స సూర్యనారాయణరాజు (సూరిబాబు) ఉపాధ్యక్షులు బూడి కృష్ణ,ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు సహాయ కార్యదర్శి ఆచంట సాయిరాం, సభ్యులు వల్లూరి నాగ వరప్రసాద్, కేసరపల్లి జయరాజు,చింతపల్లి శ్రీనివాస్, ఇల్లా జనార్ధనరావు, వాలంటీర్సు బి వెంకట రమణ, కె భారతి టి వీరభద్రకుమారి ప్రసాద్ తదితరులు గ్రంథ పాలకురాలు బత్తుల జోగారత్నంను అభినంధించినవారిలో ఉన్నారు.

## ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌కు ప్రశంసా పత్రం

**సీనియర్ అసిస్టెంట్ రహ్మాన్ కు దక్కిన గౌరవం**




**కుక్కునూరు,ప్రజా జ్యోతి,ఆగష్టు, 15 :** 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్,(ఇంచార్జ్ ఆర్.ఐ)గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఆబిద్ రహ్మాన్ కు "ఉత్తమ సీనియర్ అసిస్టెంట్"అవార్డు దక్కింది.శుక్రవారం ఏలూరులో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి,జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చేతుల మీదుగా రహ్మాన్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్,జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రెవెన్యూ శాఖలో రహ్మాన్ చేస్తున్న విధి నిర్వహణ,ప్రజా సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఉన్నతాధికారులు,స్థానిక మండల ప్రజలు రహ్మాన్‌ను అభినందించారు. రహ్మాన్ మాట్లాడుతూ తన విజయంలో సహకరించిన అధికారులు,సిబ్బంది కుటుంబ సభ్యులకు,మండలంలోని నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్న రమేష్ .......

**మంత్రి చేతుల మీదుగా ప్రసంసాపత్రం అందుకుంటున్న రమేష్......**



**చాగలమర్రి , ఆగస్టు 16( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** జిల్లా కేంద్రమైన నంద్యాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ పోలీస్ అవార్డును కానిస్టేబుల్ రమేష్ అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ న్యాయస్థాన విధుల్లో చూపిన క్రమశిక్షణ, చురుకుదనం, న్యాయవ్యవస్థ పట్ల నిబద్ధత గుర్తించి మంత్రి పరుఖ్,జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా,జిల్లా ఎస్పి సునీల్ షోరాన్ చేతుల మీదుగా రమేష్‌కు అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు.అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్న రమేష్‌ను పోలీస్ అధికారులు,ఎస్ఐ రాజారెడ్డి,ఏఎస్ఐలు ఖాదర్‌భాష,బీరప్ప, హెచ్‌సిలు రఫి,వెంకటరెడ్డి, లక్ష్మినారాయణ,సహచర పోలీస్ సిబ్బంది,హోంగార్డులు,తదితరులు అభినందించారు.

## ఘనంగా నాగుల చవితి

**పూజలు చేస్తున్న మహిళలు.....**



**చాగలమర్రి , ఆగస్టు 16( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండల వ్యాప్తంగా ఆదివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నపిల్లలు, మహిళలు వేకువజామునే తల స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి పాముల పుట్టల వద్దకు నాగులకట్టల వద్దకు వెళ్లారు. పుట్టల్లో పాలు పోసి, పిండి పదార్థాలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సందడితో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**ఎం ఈ ఓ సుధారాణి**



**హోళగుంద, ఆగస్టు 16, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 74 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి--1 సుధారాణి తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మండల పరిధిలో మొత్తం 74 పోస్టుల్లో ఎస్జిటి లకు తెలుగు, కన్నడ, ఉర్దూ మీడియంలలో కలిపి 31 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అన్ని సబ్జెక్టుల్లో 43 పోస్టులు ఉన్నాయని తెలిపారు.స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.12,500, ఎస్జిటి పోస్టులకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. తాత్కాలిక ప్రాతిపదికన 8 నెలలపాటు, 2026 సెప్టెంబర్ 1 నుంచి 2027 ఏప్రిల్ 30 వరకు కొనసాగుతాయని తెలిపారు.అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఎంఈఓ సుధారాణి తెలిపారు. అకడమిక్ అర్హతలకు 75 శాతం, ప్రొఫెషనల్ అర్హతలకు 25 శాతం వెయిటేజీ ఉంటుందని పేర్కొన్నారు ఎస్జిటి పోస్టులకు డి ఈ డి,స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బి ఈ డి అర్హత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. టెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యత ఉంటుందని, స్థానిక గ్రామం/మండలానికి చెందిన అభ్యర్థులకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.అభ్యర్థులు ఆగస్టు 16 నుంచి 21వ తేదీ వరకు తమ దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆఫ్‌లైన్ ద్వారా సమర్పించాలని ఎంఈఓ 1 సుధారాణి కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి రూ.లక్ష విలువైన వైద్య సామగ్రి విరాళం


**డాక్టర్ కార్తీక్, డాక్టర్ రేఖ సింధూరి దంపతుల ఆధ్వర్యంలో పరికరాల అందజేత**



**ఎమ్మిగనూరు, ఆగస్టు 15(ప్రజా జ్యోతి ):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎమ్మిగనూరు పట్టణంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన డాక్టర్ కార్తీక్, డాక్టర్ రేఖ సింధూరి దంపతుల ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు రూ.లక్ష విలువైన వైద్య సామగ్రిని విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 20 సెట్టింగ్ కుర్చీలు, 2 స్ట్రెక్చర్లు, 2 ఎక్స్‌రే ఫిల్మ్ వ్యూవర్లు, 2 హెచ్.పి. మీటర్లు, 2 మాన్యువల్ డైమండ్ బి.పి. ఆపరేటర్లు, 2 గ్లూకోమీటర్లను ఆసుపత్రికి అందించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ పరికరాలు ఉపయోగపడతాయని డాక్టర్ కార్తీక్, డాక్టర్ రేఖ సింధూరి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు.ఈ విరాళాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆది నాగేష్ స్వీకరించారు. దాతలకు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, యుగంధర్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కంబాల శ్రీనివాసరావు దంపతులకు అరుదైన గౌరవం...

**ఆధ్యాత్మిక ధార్మిక ప్రజాసేవలకు మెచ్చి ఘనంగా సత్కరించిన చాగంటి కోటేశ్వరరావు**






**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) ఆగస్టు 16:** రాజమండ్రి శ్రీజూపూడి సరోజినీ దేవి కళా ప్రాంగణంలో శనివారం రాత్రి ప్రారంభమైన సంగీత నృత్యోత్సవ సప్తాహం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్సీ సోమరాజు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలిత కంబాల శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ సోము వీర్రాజు కంబాల శ్రీనివాసరావు ప్రసంగించారు. తదుపరి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గొప్ప ప్రవచనాలను ప్రజలకు ప్రసంగించారు. కార్యక్రమం అనంతరం ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి విశిష్ట కృషి చేస్తున్న కంబాల శ్రీనివాసరావు సేవలను మెచ్చి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు స్వయంగా కంబాల శ్రీనివాసరావు సేవలను అడిగి తెలుసుకొని కంబాల దంపతులను శాలువా కప్పి, సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసారు. కంబాల శ్రీనివాసరావు సేవలను అభినందించి, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకు దక్కిన ఈ అరుదైన గౌరవం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. చాగంటి కోటేశ్వరరావు స్వయంగా తమకు ఆశీస్సులు అందించడం, తమకు అరుదైన గౌరవం దక్కడం నిజంగా మహద్భాగ్యం అన్నారు. ఇది జీవితంలో మరుపురాని మధురమైన ఘట్టంమని, సేవలను గుర్తించి ఇంతటి గౌరవం అందించడం ఎంతో గర్వకారణం ఉందన్నారు. ఈ గౌరవం వ్యక్తిగత ఆనందం మాత్రమే కాదని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో ప్రజాసేవ చేయాల్సిన బాధ్యతను పెంచిందన్నారు..

## అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ.. ఎంఈవోలు రామాంజినేయులు, శోభారాణి





**కౌతాళం,ఆగస్టు 16 ప్రజా జ్యోతి** రాష్ట్ర విద్యాశాఖ మరియు జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో సుమారు 1,250 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను ఎంపిక చేయనున్నట్లు కౌతాళం మండల విద్యాశాఖాధికారులు తెలిపారు.ఈ నియామకాల్లో ఎస్జిటీ లకు 707 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్స్‌కు 543 పోస్టులు కలిపి మొత్తం 1,250 ఖాళీలు ఉన్నాయి. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందులో కౌతాళం మండలం మనకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ :57 పోస్టులు ఎస్జిటి (తెలుగుః 24 పోస్టులు ఎస్జిటి( కన్నడ)16 పోస్టులు ఎస్జిటి (ఉర్దూ) 01 పోస్టు మొత్తం 97 పోస్టులు ఉన్నవి.గౌరవ వేతనం ఎస్జిటీ లకు నెలకు రూ.10,000/ స్కూల్ అసిస్టెంట్స్ కు నెలకు రూ.12,500/- దరఖాస్తుల స్వీకరణ తేదీలు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 16వ తేదీ నుండి ఆగస్టు 21వ తేదీ వరకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తుతో పాటు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల ప్రతులను జతచేసి సమర్పించాలి.అందిన దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 22వ తేదీన మండల విద్యాశాఖాధికారుల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపించడం జరుగుతుంది. పరిశీలన,ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం సెప్టెంబర్ 1వ తేదీ నుండి విధుల్లో చేరే అవకాశం కల్పించబడుతుంది. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యతఎంపిక ప్రక్రియలో మొదటి ప్రాధాన్యతగా సొంత గ్రామానికి చెందిన అర్హులైన అభ్యర్థులకు, అనంతరం సంబంధిత మండల పరిధిలోని అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. అభ్యర్థుల అర్హతలు, అందుబాటులో ఉన్న మార్గదర్శకాలు మరియు ఎంపిక నిబంధనల ప్రకారం నియామక ప్రక్రియ కొనసాగుతుంది.టెట్ అర్హతకు సంబంధించి వర్తించే నిబంధనల ప్రకారం, అర్హత కలిగిన ఇతర అభ్యర్థులకు కూడా అవకాశాలు కల్పించే విధంగా పరిశీలన జరుగుతుంది.ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కౌతాళం మండల విద్యాశాఖాధికారులు కోరారు. కౌతాళం మండల విద్యాశాఖాధికారులు కే.రామాంజనేయులు మరియు వి.శోభారాణీ లు తెలిపారు.

## 17 న ఉమ్మడి కడప జిల్లా వెటరన్ జర్నలిస్టులు కడప కలెక్టరేట్ కు తరలిరండి

ఈనెల 17వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి కడప జిల్లా వెటరన్ జర్నలిస్టులు పెన్షన్ ఇతర సమస్యలపై చర్చించేందుకు తరలిరావాలని కడప జిల్లా వెటరన్ జర్నలిస్టులు పిలుపునిచ్చారు,గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారికి మరియు పౌర సంబంధాల అధికారి ( డి పి ఆర్ ఓ) గారికి,

**విషయం:** కడప జిల్లాలోని వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లాలని విజ్ఞప్తి.సార్, కడప జిల్లా పరిధిలోని వెటరన్ జర్నలిస్టులమైన మేము గత రెండు దశాబ్దాలుగా పత్రికా రంగంలో పనిచేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలందిస్తున్నాము. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం, సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనది. పత్రికా రంగంలో సుమారు 20 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం సేవలందించి, 60 సంవత్సరాలు పైబడిన జర్నలిస్టులను వెటరన్ జర్నలిస్టులుగా ప్రభుత్వం గుర్తిస్తున్న విషయం తెలిసిందే. అయితే వయోభారం, ఆదాయ వనరులు తగ్గిపోవడం, కుటుంబ బాధ్యతలు పెరగడం వంటి కారణాలతో వృద్ధాప్యంలో అనేక మంది వెటరన్ జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో జర్నలిస్టులకు ఇప్పటికే పెన్షన్ సౌకర్యం అమలులో ఉన్న నేపథ్యంలో, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ అర్హత కలిగిన వెటరన్ జర్నలిస్టులకు గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని మా విజ్ఞప్తి. జర్నలిస్టులుగా మా జీవితంలోని అత్యంత విలువైన సంవత్సరాలను ప్రజాసేవకు అంకితం చేసిన మాకు వృద్ధాప్యంలో ప్రభుత్వం అందించే పెన్షన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు.. మా కుటుంబాలకు ఒక భరోసా, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. కావున కడప జిల్లాలోని వెటరన్ జర్నలిస్టుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, మా సమస్యను గౌరవ ముఖ్యమంత్రి గారు, సంబంధిత సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి గారు మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, ఆంధ్రప్రదేశ్‌లో వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. మా విజ్ఞప్తిని మానవతా దృక్పథంతో పరిశీలించి, వృద్ధాప్యంలో ఉన్న వెటరన్ జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా నిలిచేలా కృషి చేయాలని ప్రార్థిస్తున్నాము.

ధన్యవాదములతో..

కడప జిల్లా వెటరన్ జర్నలిస్టుల అసోసియేన్

## నందిగుంటపాలెంలో టీడీపీకి జోష్

**ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో వైసీపీ నాయకుల చేరిక**

**అభివృద్ధి సంక్షేమమే ఆకర్షణ అంటున్న చేరిక నేతలు**







**కారంచేడు ఆగస్టు 16 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)** కారంచేడు మండలం నందిగుంటపాలెంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరింది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్న వారికి ఎమ్మెల్యే సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని, గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. నందిగుంటపాలెం ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం ఎంతో కీలకమన్నారు. ఎన్ఎస్‌పీ కాలువ చివరి ప్రాంతంలో తమ భూములు ఉండటంతో గతంలో సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. కొమ్మమూరు కాలువ ద్వారా పట్టిసీమ నీరు అందుబాటులోకి రావడంతో ఆరుతడి పంటలకు భరోసా ఏర్పడిందన్నారు.పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులతో పంటలు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో పట్టిసీమ నీరు తమ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ జజ్జర మహేష్, దక్కుమళ్ల ఇస్మాయిల్, కందుల యోహాను, బి.అవినాష్, జె.అనిల్, వై.సుధీర్, వి.సుధాకర్, ఎన్.రాంబాబు, కె.మహేశ్వర్‌రావు, ఎన్.భాగ్యరాజు, ఎన్.పవన్‌కుమార్, వి.రాజు, యారం సుబ్బయ్య తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ, మండల అధ్యక్షుడు షేక్ ఖాసిం సాహెబ్, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమలశెట్టి శ్రీహరి, ఆదినారాయణ, సీనియర్ నేత అమర్నేని సుబ్బారావు, నూకతోటి ఆదెయ్య, నూకతోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న

**బాపట్లలో ఘనంగా 117వ జయంతి వేడుకలు**

**నివాళులర్పించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ**



**బాపట్ల ఆగస్టు 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను బాపట్లలో ఘనంగా నిర్వహించారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీలు రోడ్డులోని లచ్చన్న విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షను సైతం అనుభవించిన గౌతు లచ్చన్న, పేదలు, రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారని అన్నారు. సామాజిక వివక్ష, అంటరానితనం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాల్లో ఆత్మగౌరవాన్ని నింపిన గొప్ప నాయకుడని కొనియాడారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించిన లచ్చన్న ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ కూటమి ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.బాపట్లలో గౌతు లచ్చన్న సేవలు, ఆశయాలను భావితరాలకు తెలియజేసేలా ప్రతి ఏడాది జయంతి కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జయప్రకాశ్, రమేష్, రామారావు, బాల కోటేశ్వరరావు, కృష్ణ, శేఖర్, చినబాబు, వెంకట నారాయణ, చలమయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా హక్కుల పోరాట యోధుడు లచ్చన్న

**బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు గౌతు లచ్చన్న**

**-- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ**





**బాపట్ల ఆగస్టు 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బాపట్ల కర్లపాలెం రోడ్డులో సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బీసీ సంఘాల నాయకులతో కలిసి లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సామాజిక చరిత్రలో గౌతు లచ్చన్న చెరగని ముద్ర వేశారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన, అనంతరం రైతులు, కార్మికులు, కూలీలు, కల్లు గీత కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిరంతరం ఉద్యమించారని తెలిపారు.ప్రజా సమస్యలను అసెంబ్లీలో బలంగా వినిపిస్తూ, పదవులను ప్రజాసేవకు సాధనంగా భావించిన లచ్చన్న ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.లచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత సంక్షేమ చైర్మన్ తాత జై ప్రకాష్ నారాయణ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ శివలీల, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిణి మాధవి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సత్యనారాయణ, పరస రమేష్, కార్పరపు రామారావు, బీసీ సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి..



**కంబదూరు ఆగస్టు 16:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,**కంబదూరు మండలం లోని జెక్కిరెడ్డి పల్లి గ్రామంలో ముదిగల్లు గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ (60) విద్యుద్ఘాతానికి గురి అయి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్ కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు.ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా. జెక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొల్ల బాలకృష్ణ అనునతనికి సంబంధించిన నూతన ఇంటి నిర్మాణం కోసం సోమనాథ్ అనే భేల్దారి ముదిగల్లు గ్రామం నుంచి (4)గురిని పిలుచుకుని వచ్చి, ఇంటి పై భాగంలో పనులు చేపడుతున్న క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందినట్లు సమాచారం అందింద ని ఆయన వెల్లడిం చారు.మృతుడికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉండగా వారందరికీ వివాహాలు జరిగాయని ఆయన తెలియజేశారు. మృతుడు భార్య అనిత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు..విద్యుత్ లైన్ ఉన్న చోట జాగ్రత్తగా ఉండి పనులు చేసుకోవాలని ఆయన మండల ప్రజలకు సూచన చేశారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో భద్రతకు పటిష్ట చర్యలు

**ప్రయాణికుల భద్రత ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి ఎస్పీ దామోదర్**



**విజయనగరం ఆగస్టు 16 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ నెల 17న విమాన సర్వీసులు ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ పరిశీలించారు. అరైవల్, డిపార్చర్ ప్రాంతాలు, వాహనాల పార్కింగ్, వీఐపీ పార్కింగ్‌తో పాటు సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోని అంతర్గత భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రధాన మార్గాలు, జంక్షన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. విమానాశ్రయ పరిసరాల్లో నిరంతర పెట్రోలింగ్, సీసీటీవీ నిఘా, డాగ్‌స్క్వాడ్ తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం వైపు నుంచి వచ్చే వాహనాలకు, ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వెళ్లే వాహనాలకు మార్గదర్శక బోర్డులు, స్టాపర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఐఎస్ఎఫ్ అధికారులతో భద్రతా అంశాలపై సమీక్షించిన ఎస్పీ, ప్రయాణికుల లగేజీ, పాస్‌పోర్ట్‌ల తనిఖీల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో అన్ని విభాగాలు సమన్వయంతో స్పందించేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం వీఐపీ, వెయిటింగ్ లాంజ్‌లు, బ్యాగేజ్, కమాండ్ కంట్రోల్ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో భోగాపురం సీఐ కే.దుర్గా ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏవీ లీలారావు, ట్రాఫిక్ సీఐ రాము తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు వారి వివాహ వేడుకలకు హాజరైన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి



**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** కూడేరు మండలం మరుట్ల రెండవ కాలనీలో చిలుకూరు బాలకృష్ణారెడ్డి లీలావతి దంపతుల ఏకైక కుమారుడు చిలుకూరి కిరీటిరెడ్డి వెడ్స్ కల్పన లా వివాహ శుభ కార్యక్రమకు హాజరై నూతన వధూవరుల ను ఆశీర్వదించిన ఉరవకొండ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమంలో కె.వి రమణ జిల్లా అధికార ప్రతినిధి ఈశ్వర్ రెడ్డి,భయపరెడ్డి పరమేశ్వర్ రెడ్డి,శ్రీనివాస్ నాయుడు,కే శ్రీనివాస్ రెడ్డి, నీలకంఠ రెడ్డి,బండారు శ్రీనివాస్ నాయుడు, జూటూరు గోవింద్ రెడ్డి, నాగరాజు,చిలుకూరు రాజీవ్ గాంధీ రెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, జల్లిపల్లి సిద్ధారెడ్డి, కలగళ్ల భాస్కర్ రెడ్డి,పెద్దవడుగూరు వైసిపి మండల కన్వీనర్ శరభ రెడ్డి,మధుసూదన్ రెడ్డి మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వజ్ర ప్రహార్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

**58 అనుమానిత వాహనాలు సీజ్ గంజాయి నిర్మూలనే లక్ష్యం**



**బాపట్ల ఆగస్టు 16 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)**గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు నేర కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు బాపట్ల జిల్లా పోలీసులు వజ్ర ప్రహార్ కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు చీరాల వన్‌టౌన్, అమృతలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ తనిఖీలు చేపట్టారు.రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ సూచనలతో అమృతలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంచలవరం గ్రామంలో 95 మంది పోలీసులతో తనిఖీలు నిర్వహించి సరైన ధ్రువపత్రాలు లేని 29 వాహనాలను సీజ్ చేశారు. చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్ సూచనలతో బండపాలెం ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 21 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలతో కలిపి మరో 29 వాహనాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల ప్రభావం యువత భవిష్యత్తుపై తీవ్రంగా ఉంటుందని, వాటి నియంత్రణకు కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అనుమానిత ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రజలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా 112కు, బాపట్ల జిల్లా కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## వివాద స్పదంగా జెండా ఆవిష్కరణ



**కుక్కునూరు,ప్రజా జ్యోతి,ఆగస్ట్ 16 :** కుక్కునూరు మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆగస్ట్15 న జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భారత జాతీయ పతాకాన్ని తలకిందులుగా వేగురవేసిన ఘటన పలు విమర్శల కు దారి తీస్తుంది. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలలో ఆ కార్యాలయ అధికారి మాత్రమే ఎగురవేయాలి.పాఠశాలల్లో, సంస్థల్లో వారివారి చైర్మన్ తో వేగురువేస్తారు.పార్టీ కార్యాలయంలో ఆపార్టీ అధ్యక్షులుకు స్తానం ఉంటుంది.ఎవరు ఎక్కడ ఎగురవేసినా జెండాను అత్యంత జాగ్రత్తగా గౌరవిస్తూ పతాకావిష్కరణ చేయాలి.కుక్కునూరు తహశీల్దార్ కార్యాల యంలో జరిగిన పతాక వేడుకల్లో అధికారుల భాధ్యతారాహిత్యం బయటపడింది.తహశీల్దార్ ఎగురవేయాల్సిన జెండా అధికార పార్టీ నాయకునిచే తలకిందులుగా ఎగుర వేయటం ద్వారా వివాదాస్పద స్పదంగా మారింది. నాయకులు ఎగుర వేసే అవకాశాలు ఉన్నా భాద్యతగా ప్లాగ్ కోడ్ ప్రకారం చేయాలి. తలకిందులుగా ఎగరవేయ కూడదు.అయితే అక్కడ ఫస్టు తలకిందులు గా ఎగురవేసి,ఆ తరువాత సరి చేశారు.దీనిపై పై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో తెలియాల్సి ఉంది.

# రౌడీషీటర్లు ఓవరాక్షన్ చేస్తే తోక కత్తిరిస్తాం

**సీఐ డి. వెంకటేశ్వరరావు**

**శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు**



**బేతంచెర్ల:ఆగష్టు16(ప్రజాజ్యోతి)** బేతంచర్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లు ఇకపై అల్లర్లు, గొడవలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని సీఐ డి. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఓవరాక్షన్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆదివారం బేతంచర్ల పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు సీఐ డి.వెంకటేశ్వరరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నేరచరిత్రను పక్కనపెట్టి ఇకపై ప్రశాంతమైన జీవనం సాగించాలని సూచించారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా, గ్రామాల్లో అశాంతి సృష్టించినా పోలీసుల నిఘా నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు తప్పవు రౌడీషీటర్ల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడటం, బెదిరింపులకు దిగడం, గొడవలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమని సీఐ తేల్చిచెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే ఓవరాక్షన్ చేస్తే తోక కత్తిరిస్తాం, అంటూ రౌడీషీటర్లకు సీఐ గట్టి హెచ్చరిక జారీ చేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ బాబు ఉన్నారు.

## నా దేశం--నా బాధ్యత' కవితా పోటీలో కూనవరం వాసికి ప్రతిభా పురస్కారం






**కూనవరం ఆగస్టు 16. ప్రజా జ్యోతి కూనవరం:** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ సాహిత్య సంస్థ 'శ్రీశ్రీ కళావేదిక' ఆధ్వర్యంలో నిర్వహించిన 'నా దేశం--నా బాధ్యత' అంశంపై కవితా పోటీలో పోలవరం జిల్లా కూనవరం మండలం చూచిరేవులగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, శ్రీ స్వామి వివేకానంద స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు కాకునూరి కృష్ణార్జున రావు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దేశభక్తి, బాధ్యతను ప్రతిబింబించేలా ఆయన రాసిన కవితకు విశేష స్పందన లభించడంతో టాప్--20 విజేతల్లో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, ప్రధాన కార్యదర్శి పార్థసారథిలు కృష్ణార్జున రావుకు 'విజేత ప్రశంసా పత్రం' అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న చూచిరేవులగూడెం గ్రామస్తులు, విద్యాభిమానులు పలువురు కృష్ణార్జునరావును అభినందించారు

# చదివిన బడికి పుట్టిన ఊరికి రుణం తీర్చుకుంటున్న డొంకరాయి ఓల్డ్ స్టూడెంట్స్

**రెండు రోజులపాటు ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**విద్యార్థులకు ప్రోత్సాహకాలు, గ్రామానికి విలువైన మొక్కలు**



**డొంకరాయి, ఆగస్టు 16: ప్రజా జ్యోతి** తాము చదువుకున్న పాఠశాలను మరువకుండా, పుట్టి పెరిగిన గ్రామంపై మమకారంతో ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్న డొంకరాయి ఓల్డ్ స్టూడెంట్స్ మరోసారి ఆదర్శంగా నిలిచారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డొంకరాయిలో రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, విద్యా సామగ్రి అందించడంతో పాటు గ్రామానికి ఉపయోగపడే విలువైన మొక్కలను సమకూర్చారు.ప్రతి సంవత్సరం దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లో స్థిరపడిన డొంకరాయి పూర్వ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ పాఠశాలకు వచ్చి ప్రస్తుత విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొనడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఏదో ఒక మంచి కార్యక్రమాన్ని చేపడుతూ, ఇప్పటివరకు లక్షలాది రూపాయలు వెచ్చించి పాఠశాలకు అనేక మౌలిక సదుపాయాలు కల్పించారు.అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, పోటీతత్వం పెంపొందించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించారు. ప్రతి తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.అలాగే 2026 మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.10,000, రూ.6,000, రూ.4,000 చొప్పున నగదు బహుమతులు అందించి అభినందించారు.డొంకరాయి ఎంపీపీ పాఠశాల, జెడ్పీ హైస్కూల్, బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి, పెన్నులతో పాటు ప్రతి విద్యార్థికి రూ.50 చొప్పున అందజేశారు.ఈ సందర్భంగా ఇటీవల జరిగిన భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డొంకరాయి విద్యార్థులకు కూడా ప్రత్యేకంగా నగదు బహుమతులు అందించి ప్రోత్సహించారు.వారితో కలిసిదిం సా నాట్యం చేశారు,కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అతిథులు మరియు గ్రామస్తులకు ఓల్డ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో సుమారు 400 మందికి విందు ఏర్పాటు చేశారు.గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ప్రజలకు నీడనిచ్చే ఉద్దేశంతో వివిధ రకాల మొక్కలను కూడా ఓల్డ్ స్టూడెంట్స్ సమకూర్చి గ్రామానికి అందజేశారు. ఒక్కో మొక్క విలువ సుమారు రూ.3,000 వరకు ఉండేలా ప్రత్యేకంగా ఎంపిక చేసిన మొక్కలను తీసుకువచ్చారు. వీటిని గ్రామంలోని అనువైన ప్రాంతాల్లో నాటి సంరక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమాల నిర్వహణలో ఎన్. రాజగోపాల్ (గోపి), జి. కృష్ణ నాయకత్వ బాధ్యతలు చేపట్టి, డొంకరాయి ఓల్డ్ స్టూడెంట్స్ అందరిని సమన్వయం చేస్తూ వారి సహకారంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, గ్రామ సేవలో భాగస్వామ్యమవుతున్న ఓల్డ్ స్టూడెంట్స్‌లోని ఒకరైన గత నెలలో రిటైర్డ్ అయిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (ఫారెస్ట్) చల్లా శ్రీనివాస్ ను,ఈ కార్యక్రమాలను ముందుండి నడిపించిన ఎన్. రాజగోపాల్ (గోపి), జి. కృష్ణ లను గ్రామం తరఫున స్థానిక డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఘనంగా సన్మానించారు.చదివిన పాఠశాల అభివృద్ధికి, గ్రామ సంక్షేమానికి ఓల్డ్ స్టూడెంట్స్ చేస్తున్న సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. దేశ విదేశాల్లో స్థిరపడినా తమ మూలాలను మరువకుండా ప్రతి ఏడాది గ్రామానికి వచ్చి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతున్న ఓల్డ్ స్టూడెంట్స్ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు."చదివిన బడిని మరువకుండా... పుట్టిన ఊరిపై ప్రేమను చేతల్లో చూపిస్తున్న డొంకరాయి ఓల్డ్ స్టూడెంట్స్ సేవా స్ఫూర్తి అభినందనీయం" అని ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్థులు కొనియాడారు ఈ కార్యక్రమంలో అనేకమంది పూర్వపు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే...**





**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు 16-08-26)( ఆదివారం) పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు , శంకర కంటి ఆసుపత్రి ( బెంగుళూరు ) కంటి వైద్య నిపుణులు డాక్టర్ జాగ్ర మాట్లాడుతూ .....కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్,ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పత్రా శ్రీనివాసులు మాట్లాడుతూ.....కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర జాగ్ర కంటి వైద్య శిబిరానికి వచ్చిన 120 మందనీ పరీక్షించి అందులో 57 మందిని. కంటి ఆపరేషన్ కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ద ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు డిస్టిక్ చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ జయరాం రావు కమిత్కర్ రఘువీర్ రావు మానవ హక్కుల కమిషన్, పర్యావరణ పరిరక్షణ దక్షణ భారత దేశ సెక్రటరీ ఆవుల ప్రసాద్, లయన్స్ క్లబ్ కోశాధికారి డి. షేక్షావలి, ఉపకార్యదర్శి ముండే షేక్షావలి. క్లబ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యులు గంగ శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్ కుమార్, డైరెక్టర్స్ పత్ర రాకేష్, నల్లయ్య శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ రాకేష్ శంకర హాస్పిటల్ సిబ్బంది మరియు లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు

**:ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**



**కర్నూలు జిల్లా : ఆగష్టు16,(ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, రైతు బాంధవుడు, ప్రజానాయకుడు దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి 106వ జయంతి సందర్భంగా కర్నూలు పట్టణంలోని కిసాన్ ఘాట్‌లో ఉన్న ఆయన సమాధిని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను స్మరించుకుంటూ కొద్దిసేపు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, కోట్ల విజయభాస్కర్ రెడ్డి రాజకీయాల్లో విలువలకు, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఆయన అందించిన సేవలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. రైతులు, పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయని తెలిపారు.జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే కోట్ల విజయభాస్కర్ రెడ్డికి నిజమైన నివాళి అని అన్నారు.కోట్ల విజయభాస్కర్ రెడ్డి చూపిన ప్రజాహిత మార్గంలోనే తాము ముందుకు సాగుతామని, ప్రజల అభ్యున్నతే తమ కుటుంబం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని మహానేతకు ఘన నివాళులర్పించారు.

## నూతిమడుగు పాఠశాలలకు తీరిన నీటి కష్టాలు



**కంబదూరు ఆగస్టు 16:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలం నూతిమడుగు లోని ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల, జడ్పీ హైస్కూల్‌లో నీటి కొరత సమస్య తీరింది. నీటి సమస్యను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయప్ప, హైస్కూల్ హెడ్‌మాస్టర్ రాజశేఖర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రెండు బోర్లు వేయించారు. అందులో ఒక బోరులో పుష్కలంగా నీరు లభించింది. నూతిమడుగు టీడీపీ నాయకులు సత్యప్ప సహకారంతో ఆదివారం బోరుకు మోటార్ బిగించారు. దీంతో పాఠశాలలకు సమృద్ధిగా నీరు అందుబాటులోకి వచ్చింది. నీటి సమస్య తీరడంతో విద్యార్థులు, నూతిమడుగు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏపీ మోడల్ స్కూల్‌లో తెలుగు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు





**బేతంచెర్ల:ఆగష్టు16,(ప్రజా జ్యోతి)** బేతంచెర్లమండలంలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఒక తెలుగు టీజీటీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టీ. మర్యాదాస్ తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులను డెమో క్లాస్, ఇంటర్వ్యూ ద్వారా మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ లేదా పీజీతో పాటు బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు ప్రతి పీరియడ్‌కు రూ.250 చొప్పున, నెలకు గరిష్ఠంగా రూ.12,000 వరకు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 18వ తేదీలోపు సంబంధిత ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## డోన్ డిఎస్పి శ్రీనివా వాసులకు సీఎం చేతుల మీదుగాఅరుదైన గౌరవం,



**డోన్ (ప్రజా జ్యోతి) ఆగస్టు 16,** నంద్యాల జిల్లా డోన్ పట్టణం డిఎస్పి శ్రీనివాసులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలోప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నారు, ఎప్పుడు ప్రజాసేవలో ,ప్రజల మధ్యలో విధి నిర్వహణలో అంకిత భావం కలిగి నిబద్ధతతో తన కర్తవ్యాన్ని నిర్వహించుకుంటూ, పోలీస్, ప్రజలు వేరు కాదు ఫ్రెండ్లీ పోలీసుగా ఉండాలని, సూచించేవారు, పోలీస్ శాఖలో విశిష్ట సేవల నుగుర్తించి ప్రభుత్వం డీఎస్పీ శ్రీనివాసులకు ఇండియన్ పోలీస్ మెడల్ అందజేశారు, ఈ ప్రతిష్టాత్మక పురస్కారం డోన్ నియోజకవర్గం ,పోలీస్ బృందానికి,డోన్ ప్రజలకు గౌరవం తెచ్చింది,ద

## వసుధ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం చేసిన బి. నకేష్ రెడ్డి



**కౌతాళం,ఆగస్టు 16 ప్రజాజ్యోతి** శనివారం రోజున బదినే హాలు గ్రామ పెద్దలు అయినటువంటి బి. నకేష్ రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బదినేహాల్ గ్రామంలో ఉన్నటువంటి మాల కొంతెమ్మ భర్త లేట్ ఈరన్న అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో నకేష్ రెడ్డి వసుధ ఫౌండేషన్ ద్వారా అక్షరాల 10,000 రూపాయలు నగదు రూపంలో సహాయం చేయడం జరిగింది.ఈ సహాయం చేసినందుకుగాను వసుధ ఫౌండేషన్ కు అలాగే రెడ్డికి కొంతెమ్మ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది.

## మిమ్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైకాపా నాయకురాలు చౌళూరు మధుమతి రెడ్డి




**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్: ఆగస్టు 16: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:** హిందూపురం పట్టణంలోని పట్టుగొళ్ల మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్ ఐ ఎమ్ ఎస్ మానస ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైర్మన్ డా శశిధర్ కుమార్ గారు మరియు డా. నర్సి రెడ్డి ఆహ్వానం మేరకు ముక్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనివాస్ సద్లపల్లి తిమ్మారెడ్డి కారుపల్లి రవి రెడ్డి సదా శివ రెడ్డి వీరంపల్లి సుధాకర్ రెడ్డి లోకేష్ రెడ్డి తుమకుంట తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పాత పెన్షన్ సాధనలో పోరాట యోధులకు సత్కారం



**బేతంచెర్ల:ఆగష్టు16(ప్రజా జ్యోతి)** 2003 డిఎస్సి అభ్యర్థులకు పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) రద్దు కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న పోరాట యోధులను విజయోత్సవ కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు.పాత పెన్షన్ సాధన కోసం నిర్వహించిన నిరాహార దీక్షలు, పాదయాత్రలు తదితర కార్యక్రమాల్లో పాల్గొని ఉద్యమానికి అండగా నిలిచిన వారికి ఈ సందర్భంగా అవార్డులను అందజేశారు. ప్రభుత్వం పాత పెన్షన్ పునరుద్ధరణ దిశగా నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో డోన్‌కు చెందిన యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి ఉద్యమంలో తన భాగస్వామ్యానికి గుర్తింపుగా అవార్డును అందుకున్నారు. పాత పెన్షన్ సాధన కోసం సాగిన ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పలువురు పేర్కొన్నారు.

## ధర్మవరంలో సంకీర్తన క్యాటరింగ్ ప్రారంభించిన మురళీకృష్ణంరాజు

**--యాళ్ల ఏసుబాబు నూతన వ్యాపారం బాగుండాలని ఆశీర్వదించిన ముదునూరి**



**కాకినాడ జిల్లా ఆగస్టు 16(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మండలంలోని ధర్మవరం జాతీయ రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సంకీర్తన క్యాటరింగ్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.వైసీపీ యువ నాయకుడు యాళ్ల ఏసుబాబు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన మురళీకృష్ణంరాజు నూతన క్యాటరింగ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు,కుప్పిన శ్రీను,కుప్పిన నరసింహమూర్తి,మాగాపు శివ, దడాల నాగభూషణం,భైరా శ్రీనివాస్,తోట భాస్కర్‌రావు,సింగూలూరి శేఖర్,కుడుముల శ్రీను,బత్తిన సౌమ్య,రాపా రాజేష్,చింతల రాజు,పులపుకూరి బుల్లబ్బాయి,యాళ్ల ఏసుబాబు కుటుంబ సభ్యులు,స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ రంగాపురంలో ఇంటింటికీ తెలుగుదేశం



**బేతంచెర్ల:ఆగష్టు16,(ప్రజా జ్యోతి)** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2 ఏళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధి - ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా టీడీపీ కార్యదర్శి లొడ్డ శేఖర్, టీడీపీ నాయకులు వారల రాముడు, లొడ్డ రామమద్దయ్య ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నాల్లడ్డి, వల్లంపాడు వెంకటేశ్వర్లు ,పోట్టల శివ నారాయణ తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అన్నవరంలో శ్రీ మయూక ఇన్ లాడ్జి ప్రారంభించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

**--లాడ్జి యజమాని బొమ్మిడి సత్తిబాబుకు ఎమ్మెల్యే సత్యప్రభ శుభాకాంక్షలు**



**కాకినాడ జిల్లా ఆగస్టు 16(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం అన్నవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మయూక ఇన్ లాడ్జి ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.శంఖవరం మండల మాజీ వైస్ ఎంపీపీ బొమ్మిడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ లాడ్జిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు.ఈ సందర్భంగా లాడ్జి నిర్వాహకుడు బొమ్మిడి సత్తిబాబుకు ఎమ్మెల్యే సత్యప్రభ రాజా శుభాకాంక్షలు తెలియజేసి,వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలాంటి వసతి సదుపాయాలు భక్తులు,పర్యాటకులకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు పర్వత సురేష్,సీనియర్ నాయకులు బద్ది రామారావు, కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి,మండల పార్టీ అధ్యక్షుడు ఈగల దేవుళ్ళు,కూటమి నాయకులు రాజాల చిట్టిబాబు,సాధనాల లక్ష్మీ బాబు,కేళంగి జన,పలివెల సతీష్, ఘంటా బాలు దొర తదితరులు పాల్గొన్నారు.

## నాగుల చవితి పండుగ ఉత్సవాలు,



**డోన్ (ప్రజా జ్యోతి )ఆగస్టు 16** నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో ,గ్రామాలలో నాగుల చవితి పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగినాయి, డోన్ గవర్నమెంట్ ఐటి దగ్గర ఉన్న నాగుల పుట్ట శివ సుబ్రహ్మణ్యం స్వామి టెంపుల్ లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని, ఐటిఐ రాముడు శివ సుబ్రహ్మణ్యం టెంపుల్ సమీపమున మంచినీళ్లు వసతి,గుడి ఆవరణం చుట్టూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్లీనింగ్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచారు భక్తులు ఎక్కువమంది హాజరై పూజ కార్యక్రమాలు నిర్వహించారు, అంతేకాకుండా నూతన వధూవరులు నాగుల పుట్టకు, నాగుల విగ్రహాలకు పాలు పోసి, ప్రసాదాలు నైవేద్యాలు ,సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు, నాగుల పుట్టకు భక్తులు అధిక సంఖ్యలో పిల్లలు భార్య భర్తలు బంధువులు రావడంతో శివ సుబ్రహ్మణ్యం టెంపుల్ భక్తులతో కిటకిటలాడింది, అక్కడ దగ్గరలో ఉన్న నాగుల పుట్టకు దగ్గరలో ఉన్న అంజనేయ స్వామి గుడి , లక్ష్మికంబగిరి స్వామి గుడిలో భక్తులు పూజలు నిర్వహించారు,

## మాజీ స్పీకర్ తమ్మినేని ని పరామర్శించిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:** మాజీ స్పీకర్, వైఎస్సార్సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాం ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం ఆముదాలవలసలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం తమ్మినేని పై పెట్టిన భూ వివాదానికి సంబంధించిన కేసు వివరాలను ఆయనకు వివరించారు. తప్పుడు కేసు పెట్టి నన్ను నా కుటుంబాన్ని ఇరికించాలని చేస్తున్న ప్రయత్నం అని తమ్మినేని సీతారాం అన్నారు. సివిల్ కోర్టులో ఈ కేసు విచారణలో ఉండగా మాపై క్రిమినల్ కేసులు పెట్టారని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వాస్తవాలు న్యాయస్థానం ద్వారా బయటికి వస్తాయని ధైర్యంగా ఉండాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మడి రాంబాబు నాయకులు జగదీష్ పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి 106 జయంతి ఉత్సవాలు,



**డోన్ ( ప్రజా జ్యోతి )ఆగస్టు 16** నంద్యాల జిల్లా డోన్ నందు కొత్త బస్టాండ్ ఏరియాలో కీర్తి శేషులు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహమునందుయువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ తెలుగు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, విద్యార్థుల, యువకుల కోసంహక్కుల కోసం పోరాటాలకు సిద్ధమవుతున్న క్రమంలో కొన్ని డిమాండ్లతో కూడినటువంటి పోస్టర్న్ విడుదల చేయడమైనది భారత యువజన కాంగ్రెస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్ మాట్లాడుతూ కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ రాష్ట్రానికి చేసినటువంటి సేవలు మరువలేనివని వారి స్ఫూర్తితో రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమా లను నిర్మించే విధంగా, అలాగే విద్యార్థుల కోసం యువకుల కోసం పోరాడుతామని, వారికి చెందవలసిన హక్కుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు, నాణ్యతతో కూడిన విద్య, యువకులకు ఉపాధి కల్పించే విధంగా తాము పోరాటాలకుసిద్ధంగా ఉన్నామని,రాష్ట్ర వ్యాప్తంగా పోస్టర్లువిడుదల చేసి విద్యార్థులను యువకులను సమకూర్చుకొని పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నమని తెలియజేశారు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ డోన్ నియోజకవర్గ అధ్యక్షు లు అధిల్, శేఖర్, రఫీ ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షులు మధు,దాదా ఖలేందర్ , విద్యార్థి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## చాగలమర్రిలో ఘనంగా నాగుల చవితి వేడుకలు......

**పూజలు చేస్తున్న మహిళలు.....**



**చాగలమర్రి , ఆగస్టు 16( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండల వ్యాప్తంగా ఆదివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నపిల్లలు, మహిళలు వేకువజామునే తల స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి పాముల పుట్టల వద్దకు నాగులకట్టల వద్దకు వెళ్లారు. పుట్టలల్లో పాలు పోసి, పిండి పదార్థాలు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సందడితో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పేడాడ రామ్మోహన్, రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ అనకాపల్లి విజయలక్ష్మి



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**పొందూరు మండల కేంద్రంలో కస్పా వీధిలో నివాసం ఉంటున్న జనసేన పార్టీ కార్యకర్త గణేష్ ఉషారాణి నిశ్చితార్థ వేడుకలో ఆమదాలవలస నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి , మార్కెట్ కమిటీ చైర్మెన్ పేడాడ రామ్మోహన్ రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు. వీరికి గణేష్ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతన జీవితం పంచుకోబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షులు ఎలకల రమణ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి 106 జయంతి ఉత్సవాలు



**డోన్ ( ప్రజా జ్యోతి )ఆగస్టు 16** నంద్యాల జిల్లా డోన్ నందు కొత్త బస్టాండ్ ఏరియాలో కీర్తిశేషులుమాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహమునందుయువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ తెలుగు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, విద్యార్థుల, యువకుల కోసంహక్కుల కోసం పోరాటాలకు సిద్ధమవుతున్న క్రమంలో కొన్ని డిమాండ్లతో కూడినటువంటి పోస్టర్న్ విడుదల చేయడమైనది భారత యువజన కాంగ్రెస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్ మాట్లాడుతూ కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ రాష్ట్రానికి చేసినటువంటి సేవలు మరువలేనివని వారి స్ఫూర్తితో రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమా లను నిర్మించే విధంగా, అలాగే విద్యార్థుల కోసం యువకుల కోసం పోరాడుతామని, వారికి చెందవలసిన హక్కుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల కు, నాణ్యతతో కూడిన విద్య, యువకులకు ఉపాధి కల్పించే విధంగా తాము పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని,రాష్ట్ర వ్యాప్తంగా పోస్టర్లువిడుదల చేసి విద్యార్థులను యువకులను సమకూర్చుకొని పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నమని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ డోన్ నియోజకవర్గ అధ్యక్షు లు అధిల్, శేఖర్, రఫీ ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షులు మధు, దాదా ఖలేందర్ విద్యార్థి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# ఎత్తిపోతల పథకం ఆధునీకరణతో రైతులకు సాగునీరు భరోసా

- రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత
- రూ.5 లక్షలతో ఎన్.డి.పి ఎత్తిపోతల పథకం ఆధునీకరణ
- 700 ఎకరాలకు సాగునీటి భరోసా
- రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్, ఎమ్మెల్యే కూన రవికుమార్





**బూర్జ , ప్రజాజ్యోతి న్యూస్ :**ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ మండలం నీలదేవిపురం గ్రామ రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఎన్ .డి.పి ఎత్తిపోతల పథకాన్ని రూ.5 లక్షల వ్యయంతో ఆధునీకీకరించారు. ఆధునీకీకరించిన ఎత్తిపోతల పథకాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా నీలదేవిపురం గ్రామానికి సంబంధించిన సుమారు 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ఆధునీకీకరణతో రైతులకు సాగునీటి సమస్యలు తగ్గి, పంటల సాగుకు మరింత భరోసా కలగనుందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి రైతులకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ ముఖ్య నాయకులు మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వ ప్రసాద్ , డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ ,మార్క్ఫెడ్ స్టేట్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ , నగరాల డైరెక్టర్ పిల్లా కన్నం నాయుడు మండల అధ్యక్షులు రాంజీ ,లంక జగన్నాథం నాయుడు,స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పౌరాణిక రంగస్థల ఏకపాత్రాభినయ పోటీలు





**గుంటూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**భారతీయ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పౌరాణిక రంగస్థల ఏకపాత్రాభినయ పోటీలు గుంటూరులో స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 70 మంది కళాకారులు పాల్గొగా ఆమదాలవలసకు చెందిన బంకుపల్లి సోదరులు నక్షత్రగా పాత్రలో బంకుపల్లి విద్యాసాగర్ ప్రథమ బహుమతిను ,రెండవ బహుమతి హరిచంద్ర కాటిసీనుపాత్రకు బంకుపల్లి దుర్గా శ్రీనివాస్ శర్మ కు ఒకే కుటుంబం నుంచి ఇద్దరు అన్నదమ్ములు గుంటూరులో తమ హావ భావ రాగ నటన లతో ప్రదర్శించి ప్రథమ ,ద్వితీయ బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మిరియాల ప్రసాద్ ,దీపం నాగభూషణం వెంపటి కొండయ్య మొదలగు పెద్దలు చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించి పలువురు మన్నాలను పొందారు. ఒకే కుటుంబం నుంచి రెండు అవార్డులు రావడం ఇదే మొట్టమొదటిసారి అని పలువురు ప్రశంసించారు.

# ముద్రగడ మృతి తీరని లోటు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,మిథున్ రెడ్డి

కిర్లంపూడిలో ముద్రగడ చిత్రపటానికి ఘన నివాళులు..
ముద్రగడ కుటుంబ సభ్యులకు పరామర్శ..
ముద్రగడ కుటుంబానికి అండగా ఉంటాం..



**కాకినాడ జిల్లా ఆగస్టు 16(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మాజీ మంత్రి,స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతి కుటుంబ సభ్యులకే కాకుండా తమ అందరికీ తీరని లోటని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ముద్రగడతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ఆయన,కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కిర్లంపూడిలో ముద్రగడ కుటుంబాన్ని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి పరామర్శించారు. ముద్రగడ భార్య పద్మావతి,కుమారులు బాలు ప్రతిపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి గిరిబాబును పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ముద్రగడ చిత్రపటానికి వైసీపీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముద్రగడతో ఉన్న సుదీర్ఘ అనుబం ధాన్ని ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గుర్తుచేసుకు న్నారు. ముద్రగడ మృతి తమకు వ్యక్తిగతంగా కూడా తీరని లోటని పేర్కొంటూ,ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తోట నరసింహం, పేర్నినాని, కురసాల కన్నబాబు, తోట నరసింహం, జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా,ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి,జ్యోతుల చంటిబాబు, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, పెద్దాపురం, రామచంద్ర పురం నియోజకవర్గాల వైసీపీ ఇంచార్జిలు దవులూరి దొరబాబు,పిల్లి సూర్యప్రకాష్, రాష్ట్ర మాజీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు,ముద్రగడ వియ్యంకుడు నరిసే శివాజీ, ప్రముఖ పారిశ్రామికవేత్త గణేశుల రాంబాబు,రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీ కృష్ణంరాజు,రాష్ట్ర విద్యార్థి విభాగం జోన్ 2 ప్రెసిడెంట్ తోట రాంజీ,రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి బదిరెడ్డి గోవింద్, జడ్పిటిసి సభ్యులు బెహరా రాజరాజేశ్వరి దొరబాబు,రాష్ట్ర కార్యదర్శి తోట రామకృష్ణ,రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేశ్,జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు రామకుర్తి చంద్రమూర్తి, తుని నియోజకవర్గ పరిశీలికులు వాసిరెడ్డి జమీల్,జిల్లా వైసిపి అధ్యక్షురాలు వర్దినీడి సుజాత శ్రీనివాస్, ప్రత్తిపాడు,ఏలేశ్వరం శంఖవరం వైసీపీ మండల అధ్యక్షులు రామిశెట్టి నాని,గొల్లపల్లి సురేష్,నరాల శ్రీను,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కాశీ విశ్వనాథ్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి బీశెట్టి అప్పలరాజు,నాయకులు తలిశెట్టి వెంకటేశ్వరరావు,ఎలిశెట్టి నరేష్,కొప్పన శివనాథ్, పెంటకోట నాగబాబు,జువ్విన వీర్రాజు,వేగి రామకృష్ణ దోమాల గంగాధర్,బందారు రాజా, దాడి పెద్దబుజ్జి,మల్ల నాగబాబు, చిలకమర్తి వెంకటరమణ, శరకణం సంతోష్,లోగీసు శేఖర్, దత్తి రాజా,బంటుపల్లి శ్రవణ్,గొంతిరెడ్డి సతీష్,బీశెట్టి స్వామితదితరులు పాల్గొన్నారు

## ఆగమేఘాల మీద మరమ్మతులు

**తప్పును కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నం**
**చేపట్టిన నెల రోజులకే నిర్మాణాలు కుంగిపోవడంపై గుంభనం**
**ఏన్కూరు వద్ద సీతారామ లింక్ కాలువ సైడ్ బర్మలకు రిపేర్లు**

**వైరా :** ఏన్కూరు వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సీతారామ ప్రాజెక్టు వైరా లింక్ కాలువ సైడ్ బర్మ్స్.. నిర్మాణం పూర్తయిన నెల రోజులకే కుంగిపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ విషయంపై గుంభగనంగా ఉంటున్న రేవంత్ సర్కారు.. ఆగమేఘాల మీద మరమ్మతు పనులు చేపట్టింది. వెంటనే యంత్రాలను రంగంలోకి దింపి రిపేర్లు చేసింది. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ వద్ద ఒక్క పిల్లర్ కూలినందుకే.. మొత్తం కాళేశ్వరమే కూలేశ్వరమైందంటూ అబద్ధాలను విస్తృతంగా ప్రచారాలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు సీతారామ లింక్ కాలువ సైడ్ బర్మ్స్ నిర్మించిన నెల రోజులకే కుంగిపోయి వరదలో కొట్టుకుపోవడంపై ఏమి సమాధానం చెబుతుందన్న ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు విశ్వప్రయత్నాలు మొదలుపెట్టిన కాంగ్రెస్ సర్కారు.. ఆగమేఘాల మీద మరమ్మతులు చేసింది. ఈ పనులను చూసి ముక్కున వేలేసుకోవడం స్థానిక రైతుల వంతైంది.

**నిర్మాణం పూర్తయిన నెల రోజుల్లోనే..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం భద్రాద్రి జిల్లా బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్టును చేపట్టింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదవీకాలం పూర్తయ్యే నాటికి ప్రాజెక్టు పనులను 80 శాతం పూర్తిచేసింది. ఇంతలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలుత ఆ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది. ఆ తరువాత ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రాజెక్టు నీళ్లపై కన్నేశారు. వాటిని తమ ప్రాంతాలకు తరలించుకునే కుట్రలకు తెరలేపారు. నీటిని మొదట నిర్దేశించుకున్న విధంగా కాకుండా తమ సొంత ఆలోచనలతో వినియోగించేందుకు పూనుకున్నారు. ఇందుకోసం ప్రధాన కాలువలకు లింక్ కెనాళ్లు నిర్మించిన సీతారామ కాలువ ద్వారా గోదావరి నీటిని మళ్లించాలని చూశారు. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా ఏన్కూరు వద్ద సీతారామ ప్రధాన కాలువకు అడ్డుగా రాజీవ్ లింక్ కెనాల్ పేరిట రూ.72 కోట్లతో ఓ కాలువను నిర్మించారు. దీని ద్వారా గోదావరి నీటిని వైరా రిజర్వాయర్‌కు తరలించాలని, అక్కడి నుంచి నాగార్జున సాగర్ ఆయకట్టుకు అందించాలని చూశారు. అయితే, ఈ కాలువ నిర్మాణంలో భాగంగా ఏన్కూరు వద్ద నెల రోజుల క్రితం లింక్ కెనాల్ సైడ్ బర్మ్స్ నిర్మించారు. తాజాగా శుక్రవారం అవి కుంగిపోయాయి.

## గోదావరి జలాలు అందించాలని బీఆర్ఎస్ భారీ ధర్నా



**బచ్చన్నపేట :** వరంగల్ జిల్లా బచ్చన్నపేట మండలానికి గోదావరి జలాలను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు పెట్టిన రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేయడం కష్టంగా మారిందని, గోదావరి జలాలు అందితే మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీటి భరోసా కలుగుతుందని తెలిపారు. నీటి కోసం ఎదురుచూస్తూ రోజులు గడుస్తున్నా అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. నీరు వస్తేనే పంటలకు భరోసా బచ్చన్నపేట మండల రైతాంగానికి గోదావరి జలాలు అత్యంత కీలకమని నాయకులు పేర్కొన్నారు. నీటి మళ్లింపు, సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాలని డిమాండ్ చేశారు. మండలానికి గోదావరి జలాలు రాకుండా అడ్డుకుంటున్న వ్యక్తులకు కొందరు ఇరిగేషన్ అధికారులు వంతపాడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు సర్పంచుల ఫోరం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి , ఫోరం మండల అధ్యక్షుడు ఫిరోజ్ ఆరోపించారు. గోదావరి జలాల కోసం చేపట్టిన ధర్నాకు రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బచ్చన్నపేట ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ధర్నాలో సర్పంచులు మదికుంట రాధ, జిల్లాల భాస్కర్‌రెడ్డి, మహమ్మద్ ఆజాం, ఆరే రవికుమార్, పోతుల వెంకటేష్, కోడూరి స్వర్ణలత, శివకుమార్, పెరబోయిన కళ్యాణి, పరుశురాములు, నూకల కల్పన, రాజిరెడ్డి, నేల కవిత, మురళి, బచ్చన్నపేట ఉపసర్పంచ్ బైరి రజిత-వెంకటేష్ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దూడల కనకయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్, బీఆర్ఎస్ నాయకులు , రైతులు పాల్గొన్నారు.

## కోట్లలో పేరుకుపోయిన బకాయిలు

**చెల్లించాలని ఒత్తిడి తెస్తున్న అధికారులు**
**15వ ఆర్థిక సంఘం నిధులు మౌలిక వసతులకే సరి..**
**ఎస్ఎఫ్‌సీ ఫండ్స్ రాక సర్పంచ్‌ల ఇబ్బందులు**
**బిల్లుల చెల్లింపునకు ప్రత్యేకంగా డబ్బులు కేటాయించాలని డిమాండ్**
**ఒక్క హనుమకొండ జిల్లాలోనే 6 నెలల బకాయిలు రూ. 32.06 కోట్లు**




**హనుమకొండ :** ఇప్పటికే నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు కరెంట్ షాక్ తగిలింది. విద్యుత్ బకాయిలు భారంగా మారాయి. 2026 జనవరి నుంచి జూలై వరకు గ్రామపంచాయతీల విద్యుత్ బిల్లులు చెల్లించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. సర్కారు నుంచి జీపీల అభివృద్ధికి రావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం(ఎస్ఎఫ్‌సీ) నిధులు మూడు, నాలుగేళ్లుగా ఇవ్వకుండా కరెంటు బిల్లులు కట్టాలంటే ఎక్కడి నుంచి తెచ్చికట్టాలని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రా మాల్లో అభివృద్ధి కుంటుపడిందని, కనీస వసతుల కల్పనకు సైతం డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం (కేంద్రం) నుంచి వస్తున్న నిధులతో పంచాయతీలను నెట్టుకొట్టుస్తున్నామని, ఇవి కూడా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపా లు, క్లోరినేషన్, కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐలకే సరిపోవడం లేదని వాపోతున్నారు. చిన్న గ్రామపంచాయతీల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని, సిబ్బందికి కూడా వేతనాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉంటే రూ. లక్షల బిల్లులు చెల్లించడం ఎలా సాధ్యమని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల చేయాలని లేదా బిల్లుల చెల్లింపున కు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

**ఇంకా పెండింగ్‌లో రూ. 28,87,03,311**

హనుమకొండ జిల్లాలోని 210 గ్రామపంచాయతీల పరిధిలో 2026 జనవరి నెల నుంచి జూలై వరకు మొత్తం రూ. 32,06,89,573లు బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో ఇటీవల రూ. 3,19,86,262 చెల్లించగా, రూ. 28,87,03,311 పెండింగ్ ఉన్నాయి. అయితే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి సమృద్ధిగా మిషన్ భగీరథ తాగునీరు సరఫరా అయ్యేదని, ప్రస్తుతం సరిగా కాక బోర్లకు మోటర్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందని, తద్వారా బిల్లులు సైతం ఎక్కవగా వస్తున్నట్లు పలువురు సర్పంచ్‌లు చెబుతున్నారు.

# నల్లగొండలో రాక్షస రాజ్యం..
# కమీషన్ల రాజ్యం నడుస్తుంది

నల్లగొండలో రాక్షస రాజ్యం నడుస్తుంది... కమీషన్ల రాజ్యం నడుస్తుందని మాజీ బీఆర్ఎస్ శాసన సభ్యుడు కంచర్ల భూపాల్ రెడ్డి ఆరోపించారు.మంత్రి కోమటి రెడ్డి అండతోనే. అరాచకాలు కొనసాగుతున్నాయన్నారు. నల్లగొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ శాసన సభ్యుడు కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎం ఆఫీస్ మీద పోలీసుల దౌర్జన్యంపై తీవ్రంగా ఖండించారు. మరో రెండు సంవత్సరాలలో నల్గొండలో ప్రభుత్వ ఆస్తులు అమ్ముతారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఒక్కో ఇల్లుకు రూ.3 లక్షల వరకు లంచాలు పుచ్చుకున్నారు. 546 డబులు బెడ్ రూమ్ ల ఇండ్ల నిర్మాణం కేసీఆర్ నాయకత్వంలో చేశాం. స్థానిక డివిజన్‌లో ప్రజల సమక్షంలో డ్రా తీశాం. డ్రాలో పేరు వచ్చిన వారికి మాత్రమే ఉంచాం.431 ఇళ్లకు నాడు డ్రా తీశాం. డీఈవో కార్యాలయం దుప్పల పల్లి నుండి రోడ్డు వెడల్పులో ఇల్లు కోల్పోయిన వారికి హామీ ఇచ్చాం.నాటి కలెక్టర్ ఆధ్వర్యంలో 130 రోడ్డు బాధితులకు సెలక్ట్ చేశాం. నాడు డ్రాలో వచ్చిన వారిలో 150 మందికి కూడా ఇవ్వలేదు.ప్రజల నుండీ వచ్చిన, వినతి పత్రాలను కలెక్టర్ పట్టించుకోలేదు.సీపీఎం నాయకుల కార్యాలయంపై పోలీసుల దాడి అమానుషం సీపీఎం నాయకులను అరెస్ట్ చేసిన ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు కంచర్ల భూపాల్ రెడ్డి. త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు తాళాలు వేస్తాం. ఇప్పుడు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అప్రజాస్వామికంమళ్లీ డ్రా తీసి అర్హులకు ఇండ్లు ఇవ్వాల్సిందే.లేకుంటే మా ప్రభుత్వం వచ్చాక అన్ని రద్దు చేసి మళ్లీ డ్రా తీస్తాం.డబ్బులు ఇచ్చినవారు వెంటనే




వసూలు చేసుకోండి లేకుంటే తర్వాత నష్టపోతారని సూచించారు.పట్టణంలో ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తున్రు.అమృత్ స్కీం కింద నిధులు దుర్వినియోగం. వెంచర్లలో అమృత్ స్కీం సీసీ రోడ్లు వేస్తున్రు.లతీఫ్ సాబ్ గుట్టకు బఫర్ జోన్ తీయలేదు.రానున్న రోజుల్లో వెంచర్లపై విజిలెన్స్ వేస్తామన్నారు కంచర్ల భూపాల్ రెడ్డి. బీఆర్ఎస్ హయాంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేశాం. పట్టణంలో పార్కులు శిథిలావస్థకు చేరాయి. 2040 విజన్‌లో నల్లగొండను అభివృద్ధి చేయండి. ప్రభుత్వ హాస్పిటల్‌లో బీఆర్ఎస్ హయాంలో నెలకు రూ.1000 డెలివరీలు అయ్యే విధంగా అభివృద్ధి చేశాం. నేడు ప్రభుత్వ హాస్పిటల్‌లో వసతులు కరువు. 3600 యువకులకు భవిష్యత్తు ఐటీ టవర్.. రాజకీయ కక్షతోనే ఐటీ టవర్ నిర్లక్ష్యం, నల్గొండ యన్‌జీ కాలేజ్ నిర్మాణం ఆలస్యం చేశారని కంచర్ల భూపాల్ రెడ్డి ఆరోపించారు.

# ఇందిరమ్మ ఇండ్ల విక్రయం..
# సంతలో సరుకులా విక్రయిస్తున్న వైనం

**లబ్ధిదారులు ఒకరైతే.. కట్టుకునేది మరొకరు**

**పెన్‌పహాడ్ :** మండలంలో ఇందిరమ్మ ఇండ్లు సంతలో సరుకులా విక్రయిస్తున్నారు. లబ్ధిదారులు ఒకరైతే.. కట్టుకునేది మరొకరు. దీంతో ఈ పథకం లక్ష్యమే దెబ్బతింటున్నంది. ఈ పథకంలో అర్హులైన వారికి కాకుండా ఇతరులకు లబ్ధి చేకూరడం, ఒకరి పేరున ఉన్న ఇంటిని మరొకరు నిర్మించుకోవడం వంటి చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో గ్రామానికి 5 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను డబ్బులకు విక్రయిస్తున్నారు. మొదటి విడతలో మండల వ్యాప్తంగా 684 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 90 శాతం నిర్మాణం పూర్తి కావొస్తున్నాయి. ఈ పథకం అమలులో పూర్తి పారదర్శకత ఉందంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నా అమలులో మాత్రం వాస్తవ విరుద్ధంగా ఉంది.ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్లు మంజూరైనా నిర్మించుకునే స్తోమత లేకపోవడంతో, ఎలాంటి అర్హత లేని వారికి రూ.40వేల నుంచి 50వేల వరకు విక్రయిస్తూ డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం. విక్రయించిన వారి బ్యాంకు ఖాతాకే డబ్బులు జమ కావడంతో.. ఆ డబ్బును తీసి అమ్మిన వ్యక్తి ఇస్తున్నారు.

**చట్టపరమైన చర్యలు తీసుకుంటారా**

అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం తమ ప్రభుత్వ



హయాంలోనే ఇండ్ల నిర్మాణం చేట్టామని, ఎలాంటి అక్రమాలు జరగలేదని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఎవరైనా లబ్ధిదారులు నిబంధనలు ఉల్లంఘించి ఇండ్లను విక్రయించేందుకు ప్రయత్నించినా..ఇతరులు వాటిని కొనుగోలు చేసినా.. ప్రభుత్వం ఆ కేటాయింపులను రద్దు చేసి, తిరిగి స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. లబ్దిదారులకు ఇప్పటికే వేరే ఇల్లు ఉన్నట్లు తేలినా, దీన్ని వ్యాపార లావాదేవీలకు ఉపయోగించుకున్నా అర్హత రద్దవుతుంది.

# తొలి విడతకే దిక్కు లేదు..
# మలి విడత ఎట్లా?

**నత్తే సిగ్గు పడేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం**

**జిల్లాకు రూ.700 కోట్లకు.. రూ.167 కోట్లు విడుదల**

**ఏడాదిన్నర గడిచినా 16 శాతమే ఇండ్లు పూర్తి**

**సూర్యాపేట :** ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కీం నత్త సిగ్గు పడే రీతిన కొనసాగుతోంది. తొలి విడతలో జిల్లాకు 14 వేల ఇండ్లుకుగాను ఇప్పటి వరకు 16.27 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మొత్తం రూ.700 కోట్లు వెచ్చించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.167 కోట్లు మాత్రమే విడుదలయ్యాయంటే ఏ రీతిన నిర్మాణాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. 2025 జనవరి 26న ప్రారంభించిన ఈ స్కీం ఏడాదిన్నర గడిచినా పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో అంతంత మాత్రంగా కూడా పూర్తి చేయకపోగా ఇతర గ్రామాల పరిస్థితి అతీగతి లేకపోవడం గమనార్హం. తొలి విడతకే ఇంతటి నిర్లక్ష్యం అలుముకుంటే ప్రభుత్వం ఇటీవల రెండో విడత నియోజకవర్గానికి రెండువేల చొప్పున ఇండ్లను మంజూరు చేస్తామని ప్రకటించడంపై పేద, మధ్య తరగతి వర్గాలు ఇక వీరు ఇచ్చినట్లేనని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మాది ఇందిరమ్మ రాజ్యం.. పేదలకు సుపరిపాలన అందించే ప్రజాపాలన తమది అంటూ గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని విషయాల్లో అన్ని వర్గాలను మోసం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అన్నింటా విఫలమవుతూ.. ఇచ్చిన హామీల్లో



ఐదుశాతం కూడా పూర్తి చేయకుండా.. స్వర్గీయ ఇందిరాగాంధీ పేరుతో ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు నిర్మించి ఇస్తామన్న హామీని అవినీతిమయంగా మార్చారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అర్హులైన పేదలకు పార్టీలకతీతంగా కేటాయించాల్సిన ఇండ్లను అనర్హులకు ఇచ్చారని అనేకసార్లు నిరసనలు వ్యక్తమైన విషయం విదితమే. ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్న వారంతా అధికార పార్టీకి చెందిన వారే కాగా సొంత పార్టీతో పాటు తమ బంధువులనే ఎంపిక చేస్తున్నారని, అడిగినంత డబ్బులు ఇచ్చిన వారికే ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇండ్లు నిర్మాణం చేసుకుంటే రూ.5 లక్షలు ప్రకటించింది. నిర్మాణం పూర్తి చేసిన తరువాత నాలుగు నుంచి ఐదు నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించి 18 నెలలు గడిచినా 16.27 శాతమే పూర్తి చేశారు.

**ఇందిరమ్మ ఇండ్లకు నిధుల లేమి**

జిల్లాలో నిధుల లేమితో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నత్త నడకన కొనసాగుతున్నాయి. తొలి విడతలో 14 వేల ఇండ్లు మంజూరు చేశారు. ఒక్కో ఇల్లుకు రూ.5 లక్షల చొప్పున రూ.700 కోట్లు వెచ్చించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఏమైందో ఏమోగానీ జిల్లాలో కేవలం 7,928 ఇండ్లు మాత్రమే మంజూరు చేశారు. వీటిలో 6,085 ఇండ్లు గ్రౌండింగ్ కాగా 1,843 ఇండ్లకు గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది. గ్రౌండింగ్ అయిన వాటిని పరిశీలిస్తే 555 ఇండ్లు బేస్మెట్ లెవల్‌లో ఉండగా 329 ఇండ్లు గోడల నిర్మాణం పూర్తయింది. 2,603 ఇండ్లకు ఆర్‌సీ పూర్తి చేశారు. నిర్మాణం ప్రారంభమైన 18 నెలల్లో కేవలం 2,278 ఇండ్లు పూర్తయి 16.27 శాతంగా నమోదైంది. తొలి విడతదే ఇలా ఉంటే ఇక రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించడంపై ప్రజలు నవ్వుకుంటున్నారు. రెండో విడత నియోజకవర్గానికి రెండు వేల చొప్పున ఇండ్లు ఇస్తామని చెబుతుండటం.. అవీ మంజూరుకే పరిమితం తప్ప గ్రౌండింగ్ చేసి డబ్బులు ఇచ్చి నిర్మాణాలు పూర్తి చేయిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

## అభద్రత భావనలో రేవంత్ రెడ్డి
## మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపణ



**రాయికల్ ( జగిత్యాల ) :** డిజిటల్ రేషన్ కార్డుపై బొమ్మ ఉన్నా, లేకున్నా కాంగ్రెస్ రెండు సంవత్సరాలు ప్రభుత్వంలో ఉంటుంది. సీఎంగా రేవంత్ రెడ్డి ఉంటాడో, లేదో అది మాత్రం అధిష్టానం చేతులలో ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. రేవంత్ అభద్రత భావనలో ఉన్నాడని ఆరోపించారు. ఆదివారం రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులపై రేవంత్ రెడ్డి బొమ్మ ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించేందుకు కుట్ర చేస్తుందని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయకుండా ఆర్భాటాలకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, పేర్కొన్నారు. రైతు బీమాను నిలిపివేయడం , కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ చేపట్టకపోవడాన్ని గమనిస్తే కేసీఆర్ పథకాలను తొలగించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 33 మాసాలు గడుస్తున్న ఇప్పటివరకు మహిళ లక్ష్మీ పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆటో కార్మికులకు నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్న పథకాలు అమలు చేయడం లేదని వివరించారు. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలను ప్రభుత్వ నిలిపివేసే కుట్ర చేస్తుందని అన్నారు

## మెట్‌పల్లి కార్టూనిస్టుకు బాచి ప్రత్యేక అవార్డు



**మారుతీనగర్(మెట్‌పల్లి) :** ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం ( ఆకాసం ) ఆధ్వర్యంలో నిర్వహించిన బాచి అవార్డు కార్టూన్ పోటీల్లో మెట్‌పల్లి కార్టూనిస్టు వాసం నాగరాజు గీసిన చిత్రానికి ప్రత్యేక విభాగంలో బాచి అవార్డు దక్కింది. ప్రతి యేట ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘ అధ్యక్షుడు అన్నం శ్రీధర్ బాచి తల్లి భాగ్యవతి స్మారకార్థం బాచి అవార్డు కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ యేడు బాచి అవార్డు కార్టూన్ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 500లకు పైగా కార్టూన్లు వచ్చాయి. ఇందులో 13 కార్టూన్లను ఎంపిక చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన వాసం నాగరాజు కార్టూన్‌కు ప్రోత్సాహక బాచి అవార్డు ప్రత్యేక బహుమతి దక్కింది. ఈ మేరకు విజయవాడలోని బాలోత్సవ భవనంలో బార్ కౌన్సిల్ సభ్యులు, ఏపీ హైకోర్టు న్యాయవాది కృష్ణారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు కార్టూనిస్టు నాగరాజు తెలిపారు. నాగరాజు ప్రత్యేక బహుమతి పొందడం పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నిలిచి పోయిన నిర్మాణ పనులు

**బిల్లుల చెల్లింపులో జాప్యం**

**ఇబ్బందుల్లో సింగీతం గ్రామ రైతులు**

**గ్రామశివారులోని వాగు అవతల సాగుభూములు**

**వానొస్తే తెప్పపైనే ప్రయాణం..**

**పట్టించుకోని యంత్రాంగం**



**నిజాంసాగర్ :** మహ్మద్‌నగర్ మండలంలోని సింగీతం గ్రామశివారులో వాగుపై వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బిల్లుల చెల్లింపులో అంతులేని జాప్యం నెలకొనడంతో మూడేండ్లుగా పనులు ముందుకు సాగడంలేదు. రూ.4.8 కోట్లతో మంజూరైన హైలెవల్ వంతెన నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోవడంతో సింగీతం రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వాగు దాటలేక సాగు పనులు, రాకపోకలు స్తంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిలిచిపోయిన పనులు వెంటనే పూర్తిచేయాలని కోరుతున్నారు. మహ్మద్‌నగర్ మండలంలోని సింగీతం గ్రామ శివారులో వాగుపైన హైలెవల్ వంతెన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం 2023లో రూ.4.8 కోట్లు మంజూరు చేసింది. పనులు వెంటనే ప్రారంభించి, పిల్లర్ల నిర్మాణంతోపాటు వాగుకు దిమ్మెల నిర్మాణాలు పూర్తిచేశారు. కానీ పనులకు సంబంధించిన బిల్లుల మంజూరులో జాప్యం నెలకొనడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు.

**రైతన్నలకు తప్పని ఇబ్బందులు**

వాగు దాటి అవతల ఒడ్డున నర్సాపూరం, రాఘవపల్లి, రంగాపురం శివారుల్లో 800 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు వాగు దాటి వెళ్లడం, వరద ప్రవాహంలో చిక్కుకోవడం, ప్రాణాలను ఫణంగా పెట్టి పంటలను సాగు చేసే పరిస్థితి నెలకొన్నది. వాగుపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరై, మూడేండ్ల క్రితం ప్రారంభించిన పనులు ఇంతవరకూ పూర్తికాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వాగులో నీటి ప్రవాహం ఉండడంతో తెప్పలపై తాడు సాయంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటే పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బిజినెస్

### మహీంద్రా కొత్త కార్లు: ధరలు ఇలా..



మహీంద్రా అండ్ మహీంద్రా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. రెండు కొత్త బీఈ 6 ఎలక్ట్రిక్ వెర్షన్‌లను ఆవిష్కరించింది. ఒకటి స్పోర్టెక్ వేరియంట్ కాగా.. మరొకటి ఫార్ములా ఈ ఫ్రీడమ్ ఎడిషన్ ఉన్నాయి.

**మహీంద్రా బీఈ 6 స్పోర్టెక్**

స్పోర్టెక్ అనేది బీఈ 6 లైనప్‌లోని కొత్త ఫ్లాగ్‌షిప్ వేరియంట్. దీని ధర రూ. 19.45 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఢ్యూఘ్యూ స్కీమ్ కింద రూ. 11.45 లక్షలకు కొనుగోలు చేయవచ్చు. బీఈ 6 స్పోర్టెక్ వేరియంట్ చూడటానికి సాధారణ మోడల్ మాదిరిగా కనిపించినప్పటికీ.. ఇందులో ప్రత్యేకమైన స్పోర్టెక్ బ్యాడ్జ్ చూడవచ్చు. ఎల్ఈడీ హెడ్‌లైట్స్, సీ షేప్ ఎల్ఈడీ డీఆర్ఎల్, టూ-టోన్ అల్లాయ్ వీల్స్‌తో ఇది ఆకట్టుకుంటుంది. కాగా ఇది గ్రాఫైట్ స్టార్మ్ ఎక్స్‌టీరియర్ రంగులో అందుబాటులో ఉంది. స్పోర్టెక్ నలుపు, లేత గోధుమ రంగు ఇంటీరియర్‌ను పొందుతుంది. మధ్యలో స్పైన్ లేని కొత్త డాష్‌బోర్డ్‌తో వస్తుంది. ఈ లేఅవుట్ మూడు 12.3-అంగుళాల డిస్‌ప్లేలను అమర్చడానికి స్థలాన్ని కల్పిస్తుంది. ఇది వైర్‌లెస్ ఛార్జింగ్ ప్యాడ్, ఖుదీ టైప్-సి పోర్ట్‌లకు యాక్సెస్‌ను కూడా మెరుగుపరుస్తుంది. ఇది 59 కిలోవాట్, 79 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలతో లభిస్తుంది. దీని రేంజ్ 682 కి.మీ. వరకు ఉంటుంది. దీనికి వెనుక భాగంలో అమర్చిన ఎలక్ట్రిక్ మోటార్ ఉంది, ఇది 282 దీష్ట్రజూ పవర్, 380 చీఎ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.

**మహీంద్రా బీఈ 6 ఫార్ములా ఈ ఫ్రీడమ్ ఎడిషన్**

మహీంద్రా రూ. 24.45 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరతో బీఈ 6 ఫార్ములా ఈ ఫ్రీడమ్ ఎడిషన్‌ను లాంచ్ చేసింది. ఇది కొన్ని ప్రత్యేకమైన కాస్మెటిక్ అంశాలను పొందినప్పటికీ.. స్టాండర్డ్ దీజు 6 లాగానే కనిపిస్తుంది. అయితే ఇందులో ఫార్ములా ఈ బ్యాడ్జ్‌లు చూడవచ్చు. ఫార్ములా జు ఫ్రీడమ్ ఎడిషన్, డ్రైవర్ అండ్ ప్యాసింజర్ కాక్‌పిట్‌లను విభజించే సెంట్రల్ స్పైన్‌తో కూడిన పాత డాష్‌బోర్డ్ లేఅవుట్‌తో వస్తుంది. ఇందులో డ్యూయల్ 12.3-అంగుళాల డిస్‌ప్లేలు, డ్యూయల్ జోన్ ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, వైర్‌లెస్ ఛార్జింగ్ ప్యాడ్, యాంబియంట్ లైటింగ్, 540-డిగ్రీ కెమెరా, 16-స్పీకర్ల హర్మాన్ కార్డాన్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి.

# హర్మూజ్ నేర్పిన పాఠం..
# భారత్ ప్లాన్ బి!

దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తికి టార్గెట్లు

**దిల్లీ:** పశ్చిమాసియాలో ఏర్పడిన అలజడి మన వంట గదిపై ప్రభావం చూపింది. హర్మూజ్ మూసివేతతో వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌పీజీ ఉత్పత్తికి పబ్లిక్, ప్రైవేట్‌రంగ రిఫైనరీలకు, చమురు వెలికితీసే కంపెనీలకు లక్ష్యాలను నిర్దేశించింది. ప్రభుత్వం ఇలా లక్ష్యాలు నిర్దేశించడం ఇదే తొలిసారి. దేశీయంగా అవసరాలకు సరిపడా నిల్వలు వీలైనంత వరకు ఇక్కడే సమకూర్చుకోవడం ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ మేరకు తాజాగా పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 21 కంపెనీలకు రోజుకు 63,810 టన్నులు ఎల్‌పీజీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించింది.

**రోజుకు 91వేల టన్నులు**

దేశీయంగా ఎల్‌పీజీ వినియోగం భారీగా పెరిగింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో దాదాపు అన్ని ఇళ్లలో వంట గ్యాస్ వినియోగిస్తున్నారు. ఒక్క 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని భారత్ వినియోగించింది. అంటే రోజుకు సగటున సుమారు 91 వేల టన్నులన్నమాట. అందులో కేవలం 13.1 మిలియన్ టన్నులు, అంటే రోజుకు 35,900 టన్నులు మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అయ్యింది. మిగిలిన 21.3 మిలియన్ టన్నులు (రోజుకు 58,400 టన్నులు) గ్యాస్‌ను విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకున్నదే. 64 శాతం దిగుమతులపై ఆధారపడనిదే స్టవ్ వెలగని పరిస్థితి ఉండటం గమనార్హం.

**హర్మూజ్ నేర్పిన గుణపాఠం**

అమెరికా- ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి మూతపడింది. దేశీయ అవసరాలకు దిగుమతి



చేసుకునే ఎల్‌పీజీలో 90 శాతం ఈ జలసంధి ద్వారానే వస్తోంది. ఈ కీలక రవాణా మార్గం మూతపడడంతో దేశీయంగా వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. అప్పటికప్పుడు దేశీయ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలకు ప్రభుత్వం ఆదేశించింది. కమర్షియల్ సిలిండర్ విక్రయాలపై ఆంక్షలు పెట్టింది. గృహ వినియోగ సిలిండర్ బుకింగ్ గడువునూ పెంచింది. పైప్డ్ గ్యాస్‌ను ప్రోత్సహించింది.

**రిలయన్స్‌కు అత్యధికంగా**

దేశీయంగా సరిపడా ఉత్పత్తి ఉంటే ఇలాంటి పరిస్థితులు తలెత్తేవి కాదని భావించిన ప్రభుత్వం.. రిఫైనరీలు, చమురు వెలికి తీసే కంపెనీలకు ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించింది. మొత్తం 18 ప్రభుత్వరంగ రిఫైనరీలకు 31,470 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయాలని రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్‌కు అత్యధికంగా 18 వేల టన్నులను టార్గెట్‌గా పెట్టింది. నయారా ఎనర్జీకి 4,480 టన్నులు, మహారత్నకు చెందిన ఓఎన్‌జీసీ, గెయిల్ కంపెనీలకు 6,460 టన్నులు ఉత్పత్తి చేయాలని తెలిపింది. ప్రతి ఆరు నెలలకు జనవరి 1న, జులై 1న దేశీయ అవసరాలను అనుసరించి కొత్త లక్ష్యాలను నిర్దేశిస్తామని ప్రభుత్వం తన ఉత్తర్వులు పేర్కొంది.

### ఈ వారం ఐపీఓలు: 7 కంపెనీలు రూ.6400 కోట్లు

ఇంటర్నెట్ డెస్క్: దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. ఈ వారం కూడా పలు కంపెనీల ఐపీఓలు ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఏడు కంపెనీలు సంయుక్తంగా రూ.6,400 కోట్ల నిధులను సమీకరించనున్నాయి. లలితా జువెలరీ, హోరైజన్ ఇండస్ట్రియల్ వంటి పలు కంపెనీలు ఇందులో ఉన్నాయి. మరి వాటి వివరాలు పరిశీలిస్తే.. బ్లాక్‌స్టోన్ మద్దతు కలిగిన హోరైజన్ ఇండస్ట్రియల్ పార్క్ కంపెనీ ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ.2,600 కోట్ల నిధులను సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.57-60గా కంపెనీ నిర్ణయించింది. ఐపీఓ నిధులను కంపెనీ రుణాల చెల్లింపునకు ఉపయోగించనుంది. ప్రముఖ ఆభరణాల తయారీ కంపెనీ లలితా జువెలరీ కూడా రూ.1700 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 17న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.190-201గా కంపెనీ నిర్ణయించింది. రూ.1200 కోట్ల విలువైన తాజా షేర్లు, రూ.500 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. శంకేశ్ జువెలర్స్ రూ.367 కోట్లు నిధుల సమీకరణతో ఆగస్టు 18న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ధరల శ్రేణి రూ.88-93గా కంపెనీ నిర్ణయించింది. 2.95 కోట్ల తాజా



షేర్లు, కోటి షేర్లు ఆఫర్ల ఫర్ సేల్ రూపంలో విక్రయానికి ఉంచుతున్నారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల లక్ష్యంతో ఆగస్టు 18న ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.342-360 కంపెనీ నిర్ణయించింది. 48 లక్షల తాజా షేర్లు, 30.37 లక్షల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. గాజా క్యాపిటల్ బ్రాండ్‌కు చెందిన గాజా అసెట్ మెనేజ్‌మెంట్ రూ.550 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 19న ఐపీఓకు వస్తోంది. ధరల శ్రేణి రూ.152-160 గా కంపెనీ నిర్ణయించింది. రూ.450 కోట్ల తాజా షేర్లు, రూ.100 కోట్ల ఆఫర్ ఫర్‌సేల్ రూపంలో ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఇండియా) ఆగస్టు 20న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.95 కోట్ల తాజా షేర్లు, రూ.1.85 కోట్ల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి. గోల్డ్ అండ్ సిల్వర్ ప్లాట్‌ఫాం అగ్మోంట్ ఎంటర్‌ప్రైజెస్ రూ.825 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 21న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ.620 కోట్ల తాజా షేర్లు, రూ.205 కోట్ల ఆఫర్ ఫర్‌సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణిని కంపెనీ వెల్లడించలేదు. స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ కంపెనీ కూడా రూ.583 కోట్ల నిధుల లక్ష్యంతో ఆగస్టు 24న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది.

**కొనుగోళ్ల వైపు ఎఫ్‌పీఐలు**

ఆగస్టు మొదటి అర్ధభాగంలో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు కొనుగోళ్ల వైపు నిలిచారు. ఈ మధ్య కాలంలో నికరంగా రూ.16,621 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేశారు. జులైలోనూ దాదాపు రూ.20,200 కోట్ల భారత ఈక్విటీ షేర్లను ఎఫ్‌పీఐలు కొనుగోలు చేసినట్లు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ డేటా పేర్కొంది.

# అర్ధ శతకంతో మెరిసిన జురెల్..
# టీమిండియా భారీ స్కోర్..!

గాలే టెస్టులో తొలి రోజే పటిష్ట స్థితిలో నిలిచిన భారత జట్టు రెండో రోజు తడబడింది. దేవ్‌దత్ పడిక్కల్(167) భారీశతకంతో మెరిసినా.. మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. వర్షం ప్రభావంతో శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో స్కోర్ వేగం తగ్గింది. అయితే.. టీ సెషన్‌లో ధ్రువ్ జురెల్(51), మానవ్ సుతార్(24)లు విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో పేసర్ ప్రభాత్ జయసూర్య(4-109) వరసగా వికెట్లు తీయడంతో భారత్ ఆలౌట్ అంచున నిలిచింది. తొలి టెస్టులో భారీ స్కోర్ దిశగా సాగుతున్న భారత జట్టు రెండో రోజు దేవ్‌దత్ పడిక్కల్(167 : 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా.. చూస్తుండగానే రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది. వెంటవెంటనే ఇద్దరూ కీలక ప్లేయర్లు ఔటైన వేళ.. ధ్రువ్ జురెల్(51) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్.. డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(13) విఫలమైనా.. జురెల్ ఆచితూచి ఆడాడు. లహిరు కుమార ఓవర్లో మానవ్ సుతార్(24) బౌండరీతో స్కోర్ నాలుగొందలు దాటింది. అర్ధ శతకం సాధించిన జురెల్‌ను ప్రభాత్



జయసూర్య కాసేపటికే సుతార్‌ను డగౌట్ చేర్చాడు. సిరాజ్ త్వరగా వెనుదిరిగినా కుల్దీప్ యాదవ్(12 నాటౌట్) పట్టుదలగా ఆడాడు. ప్రసిధ్ కృష్ణ(1 నాటౌట్) కూడా వికెట్ కాచుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి భారత్ 460 పరుగులు చేసింది.

### ఛ్ఛే.. చైనాతో డ్రా.. బోణీ అవకాశం చేజారిందిలా..!

ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌ను భారత జట్టు డ్రాతో ఆరంభించింది. ఒలింపిక్ కాంస్య పతక విజేత చైనాతో ఆదివారం హోరాహోరీ మ్యాచ్‌లో ఆధిక్యంలో నిలిచిన టీమిండియా ఆఖర్లో పట్టుసడలించింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2-2తో స్కోర్ సమం చేసింది. దాంతో మన జట్టు గెలవాల్సిన మ్యాచ్ కాస్త డ్రాగా ముగిసింది. భారత్ తరఫున నవ్‌నీత్, దీపికలు చెరొక గోల్‌తో రాణించారు. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల జట్టు అదిరే బోణీ కొట్టగా.. మహిళలు మాత్రం డ్రాతో సరిపెట్టుకున్నారు. వాగ్నర్ హాకీ స్టేడియంలో ఆదివారం చైనాను నిలువరించడంలో విఫలమైన టీమిండియా 2-2తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్ మొదలైన 8వ నిమిషంలోనే నేహ అందించిన పాస్‌ను నవ్‌నీత్ మెరుపు వేగంలో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపింది. అయితే.. 15వ నిమిషంలో ఝూంగ్ ఇంగ్ చైనాకు తొలి గోల్ అందించగా స్కోర్ 1-1తో సమం అయింది. రెండో అర్ధ భాగంలో దీపిక డ్రాగ్ ఫ్లిక్ గోల్‌తో ఆధిక్యంలో నిలిచిన భారత్ ఆపై బంతిపై నియంత్రణ కోల్పోయింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2-2తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.



## స్పోర్ట్స్

### ఫైనల్లో కంగుతిన్న సన్‌రైజర్స్.. హండ్రెడ్ ట్రోఫీని ముద్దాడిన ట్రెంట్ రాకెట్స్..!



మహిళల హండ్రెడ్ లీగ్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో జయభేరి మోగించిన ట్రెంట్ రాకెట్స్ తమ కలను సాకారం చేసుకుంది. లీగ్ దశలో దుమ్మురేపిన సన్‌రైజర్స్ లీడ్స్(రాబఅతీఅంవతీం రావవసం)ను టైటిల్ పోరులో 91 పరుగులకే కట్టడి చేసిన రాకెట్స్.. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన అష్లే గార్డ్‌నర్ సారథ్యంలోని రాకెట్స్ ది హండ్రెడ్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. ఇంగ్లండ్ గడ్డపై నిర్వహించిన మహిళల హండ్రెడ్ లీగ్ 2026 టైటిల్‌ను ట్రెంట్ రాకెట్స్ ఒడిసిపట్టింది. లార్డ్స్ మైదానంలో ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్‌పై భారీ విజయంతో ఛాంపియన్‌గా అవతరించింది రాకెట్స్. చిన్నపాటి లక్ష్యాన్ని 54 బంతుల్లోనే ఊఫ్‌మనిపించింది గార్డ్‌నర్ బృందం. 92 పరుగుల ఛేదనలో ఓపెనర్లు సోఫియా డంక్లే(41), బేత్ మూనీ(31 నాటౌట్)లు శుభారంభమిచ్చారు. సన్‌రైజర్స్ బౌలర్లను ఎడాపెడా ఉతికేసిన ఈ ద్వయం బౌండరీతో స్కోర్‌బోర్డును ఉరికించింది. డంక్లే, నాట్ సీవర్ బ్రంట్(4)లు ఔటైనా.. కెప్టెన్ అష్లే గార్డ్‌నర్(9 నాటౌట్)తో కలిసి రాకెట్స్‌ను తొలిసారి హండ్రెడ్ లీగ్ విజేతగా నిలిపింది మూనీ.


**రెండో అత్యల్ప స్కోర్**

లీగ్ దశలో సంచలన ఆటతో ఫైనల్ చేరిన సన్‌రైజర్స్ లీడ్స్ ఆఖరి మెట్టుపై తడబడింది. ఫామ్‌లో ఉన్న ఫొబే లిచ్‌ఫీల్డ్(10) సహా, మిడిలార్డర్ బ్యాటర్లు విఫలమవ్వడంతో అనూహ్యంగా 91 పరుగులకే ఆలౌటైంది. రాకెట్స్ బౌలర్లలో కిమ్ గార్త్(2-18), సమంతా బేట్స్(2-17), చార్లీ ఫిలిఫ్స్(2-12)లు రెండేసి వికెట్లతో రాణించగా.. సథర్‌లాండ్ 25 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఫలితంగా డానియల్ గిబ్సే సారథ్యంలోని ఆరెంజ్ ఆర్మీ ఈ లీగ్ ఫైనల్లో రెండో అత్యల్ప స్కోర్ నమోదు చేసింది.

## 'కొరియన్ కనకరాజు'కు హాలిడే బూస్ట్..
## 9వ రోజూ అదరగొట్టిన వరుణ్ తేజ్ సినిమా!





మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ చిత్రం ' కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద అదే జోరును కొనసాగిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వచ్చిన హాలిడే అడ్వాంటేజ్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుంది. హాలిడే కావడంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ పెరగడంతో పాటు టికెట్ సేల్స్ కూడా బాగానే పెరిగాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫామ్‌లలో కలిపి దాదాపు 56 వేల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. విడుదలైన తొమ్మిదో రోజున కూడా ఈ స్థాయిలో టికెట్ డిమాండ్ ఉండటం సినిమాకు పాజిటివ్ అంశంగా మారింది. హాలిడే కారణంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్ కూడా థియేటర్లకు రావడంతో 'కొరియన్ కనకరాజు'కు మంచి ఆక్యుపెన్సీ నమోదైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే సినిమాకు వచ్చిన వర్డ్ ఆఫ్ మౌత్ కూడా ప్రేక్షకులను థియేటర్ల వైపు తీసుకువస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. టికెట్లకు డిమాండ్ పెరగడంతో పలు ప్రాంతాల్లో థియేటర్ యాజమాన్యాలు అదనపు షోలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హాలిడే రోజున పెరిగిన ఆక్యుపెన్సీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని షోలు అందుబాటులోకి తీసుకురావడం సినిమాకు మరో బూస్ట్ ఇచ్చింది. సాధారణ రోజులతో పోలిస్తే స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రేక్షకుల స్పందన మెరుగ్గా ఉండటంతో.. రాబోయే రోజుల్లో కూడా సినిమా బాక్సాఫీస్ వద్ద తన రన్‌ను కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత వచ్చిన ఆదివారం కూడా 'కొరియన్ కనకరాజు'కు కీలకంగా మారింది. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం షోలకు టికెట్లకు మంచి డిమాండ్ కనిపిస్తున్నట్లు సమాచారం. హాలిడే వీకెండ్‌లో వచ్చిన బూస్ట్‌తో ఆదివారం కూడా సినిమా మరో మంచి నంబర్ నమోదు చేసే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమా ఇదే స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటే రెండో వీకెండ్‌లోనూ వసూళ్లు నిలకడగా ఉండే అవకాశం ఉంది. వరుణ్ తేజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు చేయని తరహాలో హారర్ కామెడీ జానర్‌లో కనిపించారు. మేర్లపాక గాంధీ తనదైన కామెడీ టచ్‌తో పాటు హారర్ ఎలిమెంట్స్‌ను మేళవించి సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సినిమాను నిర్మించారు. ప్రముఖ సంగీత దర్శకుడు థమన్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. మొత్తానికి తొమ్మిదో రోజుకు చేరుకున్నప్పటికీ 'కనకరాజు'కు టికెట్ డిమాండ్ కొనసాగడం విశేషంగా మారింది. ముఖ్యంగా ఇండిపెండెన్స్ డే హాలిడే సినిమాకు మంచి బూస్ట్ ఇవ్వడంతో.. ఆదివారం కూడా ఇదే జోరు కొనసాగుతుందా, రెండో వీకెండ్‌లో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి నంబర్లు నమోదు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.




## బాక్సాఫీస్ వద్ద సూర్య రికార్డుల మోత..
## రెండు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్'!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో మరోసారి నిరూపించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా పాన్ ఇండియా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమా విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లను సాధించి అరుదైన రికార్డును సృష్టించింది.వీశీజఅవం ఈ చిత్రంలో సూర్య సరసన మమిత బైజు హీరోయిన్‌గా నటించగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై సూర్య సృష్టించిన ఈ సునామీ వసూళ్లతో ట్రేడ్ వర్గాలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్ల వద్ద 'బ్లాక్‌బస్టర్ విశ్వనాథ్ అండ్ సన్స్' జోరు కొనసాగుతుండటంతో చిత్ర యూనిట్ ఆనందంలో మునిగిపోయింది. త్వరలోనే ఈ సినిమా మరిన్ని రికార్డులను బ్రేక్ చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఖ

## రెండు రోజుల్లోనే రూ.80 కోట్లు..
## బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతున్న
## ఇమ్రాన్ హష్మీ 'ఆవారాపన్ 2'



బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో నితిన్ కక్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'ఆవారాపన్ 2' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్ కానుకగా ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా విడుదలైన రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ సినిమాతో పోటీగా బరిలోకి దిగిన సినిమాల కంటే ముందు వరుసలో నిలిచి తన జోరును కొనసాగిస్తోంది. మొదటి రోజుతో పోలిస్తే శనివారం ఈ సినిమా కలెక్షన్స్ ఏకంగా 53 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేశాయి. తాజాగా రిపోర్ట్స్ ప్రకారం.. దేశవ్యాప్తంగా దాదాపు 10,496 షోలతో 'ఆవారాపన్ 2' రెండవ రోజు రూ. 33.75 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. దీంతో రెండు రోజుల్లో భారతదేశంలో దీని నెట్ కలెక్షన్లు రూ. 55.75 కోట్లకు చేరుకోగా, ఇండియా గ్రాస్ రూ. 66.90 కోట్లుగా నమోదయ్యాయి. కేవలం దేశంలోనే కాకుండా ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రం సత్తా చాటుతోంది. శనివారం విదేశాల్లో సుమారు రూ. 3.50 కోట్లు రాబట్టగా, మొత్తం ఓవర్సీస్ గ్రాస్ రూ. 6 కోట్లకు చేరింది. దీంతో ఈ సినిమా ప్రపంచవ్యాప్త గ్రాస్ కలెక్షన్స్ సుమారు రూ. 72.90 కోట్లకు చేరుకుని, రూ. 80 కోట్ల మైలురాయికి చేరువయ్యింది. 2007లో వచ్చిన కల్ట్ హిట్ 'ఆవారాపన్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా వచ్చింది. మొదటి భాగం మొత్తం వసూలు చేసిన కలెక్షన్ల కంటే, ఈ సీక్వెల్ ఒక్క రోజులోనే దానికంటే సుమారు 27 రెట్లు అధిక వసూళ్లను సాధించి సరికొత్త రికార్డుల వైపు అడుగులు వేస్తోంది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీతో పాటు దిశా పటాని, షబానా ఆజ్మీ, సువిందర్ విక్కీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆదివారం వీకెండ్ ముగిసేసరికి కలెక్షన్స్ మరింత బలపడే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## 'ఇరుముడి'లోని
## అయ్యప్ప సాంగ్ చూశారా?

రవితేజ హీరోగా చేస్తున్న లేటెస్ట్ సినిమా 'ఇరుముడి'. అయ్యప్పస్వామి నేపథ్యం కూడా ఇందులో కొంతమేర ఉంది. ఇప్పటికే పాటలు, ట్రైలర్ రిలీజయ్యాయి. ఈ శుక్రవారమే (ఆగస్టు 21) మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఇందులోనే 'మల్లెపూల పల్లకి' అంటూ సాగే అయ్యప్ప పాటని విడుదల చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రవితేజ ఓ మధ్య తరగతి తండ్రిగా నటించాడు. ప్రియా భవానీ శంకర్ ఇతడికి జంటగా కనిపించనుంది. నక్షత్ర అనే బాలనటి, రవితేజ కూతురిగా చేసింది. జీవీ ప్రకాశ్ సంగీతమందించాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. గత కొన్నేళ్లుగా హిట్ అనేది లేని రవితేజకు ఇది కమ్ బ్యాక్ అవుతుందని అభిమానులు అనుకుంటున్నారు. మరి ఇదెంత వరకు నెరవేరుస్తుందో చూడాలి?

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,